# క్రైమ్ మిర్రర్®
Voice of Anti Corruption

హైదరాబాద్
13-10-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 203

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


# కేటీఆర్ చుట్టూ ఫార్ములా- ఈ రేసు ఉచ్చు!

## ఏసీబీ కోర్టులో తాజాగా డిశ్చార్జ్ పిటిషన్

## గతంలో సుప్రీంకోర్టుకు వెళ్లినా చుక్కెదురు

గులాబీ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చుట్టూ కొత్త ఉచ్చు బిగుస్తోంది. ఫార్ములా ఈ రేస్ నిధుల మళ్లింపు అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. ఈ నేపథ్యంలో ఆయన సరికొత్త న్యాయపోరాటానికి తెర లేపారు. ఏసీబీ నమోదు చేసిన చార్జ్ షీట్ నుంచి తన పేరును పూర్తిగా తొలగించాలని కోరుతూ హైదరాబాద్ నాంపల్లిలోని ప్రత్యేక ఏసీబీ కోర్టులో డిశ్చార్జ్ పిటిషన్ దాఖలు చేశారు.

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** రూ. 55 కోట్ల హెచ్ఎండిఏ నిధులను విదేశీ సంస్థకు నిబంధనలకు విరుద్ధంగా బదిలీ చేశారన్న అభియోగాలపై దర్యాప్తు సంస్థ దాఖలు చేసిన చార్జ్ షీట్ ను కొట్టివేయాలని ఆయన కోర్టును అభ్యర్థించారు. న్యాయస్థానం ఈ పిటిషన్ పై విచారణను నవంబర్ కు వాయిదా వేసింది. అయితే ఇప్పటికే ఎఫ్ఐఆర్ను

2లో





## రేడియల్ రోడ్ టెండర్లపై

# రగడ..

### రేవంత్ సర్కారుకు రాజగోపాల్ రెడ్డి సవాల్

- రూ.3,296 కోట్ల ప్రాజెక్టులో అవకతవకలు జరిగాయంటూ ఆరోపణలు
- రూ.600 కోట్ల తక్కువకు బిడ్లు వేసినా పక్కన పెట్టారని వెల్లడి
- రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే ప్రకటన
- సుప్రీంకోర్టు వరకు న్యాయపోరాటం చేస్తానని స్పష్టీకరణ

**హైదరాబాద్:** ప్రతిపక్షాల విమర్శల కంటే సొంత పార్టీ నేతల ప్రశ్నలే ఇప్పుడు తెలంగాణ కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారాయి. హైదరాబాద్‌లో చేపట్టనున్న భారీ రహదారి ప్రాజెక్టు టెండర్ల వ్యవహారం

మిగతా 3లో

## ఓట్ల తొలగింపుపై

# రేవంత్ ఫైర్..



- ఈసీపై సంచలన ఆరోపణలు
- సర్ ప్రక్రియను బీజేపీకి అనుకూలంగా వాడుకుంటున్నారని ఆరోపణ
- యువత, నిరుద్యోగులు, పేదల ఓట్లే లక్ష్యమంటూ విమర్శలు
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ నిర్ణయాలపై ప్రశ్నలు
- రాహుల్ గాంధీ చేపట్టిన ఉద్యమానికి రేవంత్ మద్దతు

- మిగతా 2 వ పేజీలో

ఓటర్ల జాబితాలో ఒక్క పేరు తొలగినా అది ప్రజాస్వామ్యంపై ఎలాంటి ప్రభావం చూపుతుంది? అర్హులైన ఓటర్లకు తమ హక్కు దక్కకపోతే బాధ్యత ఎవరిది? ఇప్పుడు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లేవనెత్తుతున్న ప్రశ్నలు ఇవే. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటోందంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు జాతీయ రాజకీయాల్లో చర్చకు దారితీశాయి.

TDP BJP JANA SENA

## కూటమిలో సీట్ల సర్దుబాటు!

- స్థానిక ఎన్నికలకు మూడు పార్టీలు రెడీ
- చంద్రబాబు, పవన్, పివిఎన్ మాధవ్ భేటీ
- అనంతరం పదవుల పంపకం పై కీలక ప్రకటన

క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో: స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఏ క్షణం అయినా నోటిఫికేషన్

## ఓటర్ల జాబితాపై పోరు..

- సుప్రీంకోర్టును ఆశ్రయించిన రాహుల్ సహా 11 మంది విపక్ష నేతలు
- ఎస్ఐఆర్ ప్రక్రియపై అభ్యంతరాలతో రిట్ పిటిషన్
- రాహుల్ గాంధీ సహా ఇండియా కూటమి నేతల న్యాయపోరాటం
- సీఈసీ రాజీనామాకు డిమాండ్ చేస్తూ నిరసన
- విపక్షాల ఆరోపణలను తోసిపుచ్చిన బీజేపీ





# సింగూరు నీళ్లు ఎక్కడికి?

### ప్రభుత్వంపై హరీశ్ రావు ప్రశ్నలు

- సింగూరు ప్రాజెక్టు నీటి నిర్వహణపై తీవ్ర అభ్యంతరాలు
- 29 టీఎంసీల నీటిని ఖాళీ చేసి పనులు పూర్తి చేయలేదని ఆరోపణ
- హైదరాబాద్ సహా ఐదు జిల్లాల తాగునీటిపై ఆందోళన
- విద్యుత్ కోతలు, సాగునీటి సమస్యలపైనా కాంగ్రెస్ సర్కారును నిలదీత

హైదరాబాద్, అక్టోబర్: తాగునీటి కోసం ప్రజలు ఎదురుచూడాల్సిన పరిస్థితి వస్తే ప్రభుత్వ ప్రాధాన్యతలపై ప్రశ్నలు తలెత్తడం సహజం. తెలంగాణలో సింగూరు ప్రాజెక్టు నీటి వినియోగాన్ని ప్రస్తావిస్తూ

మిగతా 3లో




## తమిళనాడులో

# మార్పు!

- ప్రధాని మోదీ పర్యటనలో కనిపించని నిరసనలు
- ప్రతిపక్షాలతో పాటు ప్రజా సంఘాల్లో మారిన వైఖరి
- కేంద్రంతో తగ్గిన ఘర్షణ వాతావరణం

క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్ : దేశ రాజకీయాల్లో కర్ణాటక రాజకీయం వేరుగా ఉంటుంది. అక్కడ జాతీయవాదం కంటే ప్రాంతీయవాదానికి బలం ఎక్కువ.

## విజయసాయిరెడ్డి

# యూ టర్న్!

- సొంత పార్టీ ఏర్పాటు నిర్ణయం పై వెనక్కి
- తిరిగి వైసిపిలోకి?
- జగన్ నుంచి గ్రీన్ సిగ్నల్ లభించడంతోనే..

2లో

## ఓట్ల అక్రమాలపై ఆధారాలుంటే

# చూపించండి..

### ఈటల రాజేందర్ సవాల్

- ఢిల్లీలో ఇండియా కూటమి నిరసనలపై బీజేపీ ఎంపీ విమర్శలు
- ఆరోపణలు చేసేవారు ఎన్నికల సంఘాన్ని కలవాలని సూచన
- బీహార్ ఎన్నికల నుంచి ప్రతిపక్షాలు పాఠాలు నేర్చుకోవాలని హితవు
- నిరసనలతో ఢిల్లీ ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని వ్యాఖ్య

3లో



# తిరుమలలో కొత్త వివాదం!

- మైసూర్ మహారాజా అతిథి భవన్ ను పర్యాటక రంగానికి బదలాయింపు
- కర్ణాటక ప్రభుత్వం సంచలన నిర్ణయం.. టీటీడీ అభ్యంతరకరం

## ఓట్ల తొలగింపుపై

# సవాళ్ల

### పర్వం.. పొన్నంకు రాంచందర్ రావు కౌంటర్

- ఓటు హక్కు కోల్పోయినవారిని చూపిస్తానన్న పొన్నం ప్రభాకర్
- పది మందిని తీసుకురావాలంటూ రాంచందర్ రావు ప్రతి సవాల్
- ఓటర్ల జాబితా సవరణపై కాంగ్రెస్, బీజేపీ మధ్య మాటల యుద్ధం
- తెలంగాణలో ఫసల్ బీమా అమలుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి డిమాండ్





# విజయసాయిరెడ్డి యూ టర్న్!



**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** విజయసాయిరెడ్డి పార్టీ పెడతారా? అసలు ఆయనకు పార్టీ పెట్టే ఉద్దేశం ఉందా? ఇప్పుడు పొలిటికల్ వర్గాల్లో ఇదే చర్చ నడుస్తోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పిన ఆయన సొంతంగా ప్రాంతీయ పార్టీ పెడతానంటూ గత కొద్దిరోజులుగా హడావిడి చేస్తున్నారు. ఇదిగో దసరాకు కొత్త పార్టీ అంటూ ప్రకటన చేశారు. ఇప్పుడు సడన్ గా యూ టర్న్ తీసుకున్నారు. పార్టీ పెట్టడం లేదని ప్రకటించారు. అయితే మొత్తంగా పార్టీ విరమణ ప్రకటన చేయకుండా.. వాయిదా అని చెబుతున్నారు. రేపటి నుంచి వారం రోజులపాటు ఆయుర్వేద చికిత్స నిమిత్తం వెళ్తున్నానని.. స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత పార్టీ ఆవిర్భావ దినోత్సవ తేదీని ప్రకటిస్తానని చెబుతున్నారు. దీంతో అందరిలో ఒక రకమైన అనుమానం కనిపించింది.

**రాజకీయాల నుంచి తప్పుకుంటానని..**

దాదాపు ఏడాదిన్నర కిందట ఆయన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పారు. 2025 జనవరిలో ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఇకనుంచి రాజకీయాలు చేయనని.. వ్యవసాయం చేసుకుంటానని సెలవిచ్చిన ఆయన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మాత్రమే కాకుండా ఆ పార్టీ తరపున లభించిన రాజ్యసభ సభ్యత్వానికి కూడా రాజీనామా చేశారు. అయితే ఉన్నట్టుండి తనలో రాజకీయ ఆకాంక్ష తగ్గలేదని చెప్పి పార్టీ పెడతానంటూ ప్రకటన చేశారు. పార్టీ విధివిధానాల పేరుతో ఊరూరా తిరిగి ప్రెస్ మీట్ లు పెట్టారు. ఏరా పార్టీ ముహూర్తం సమయానికి అకస్మాత్తుగా ప్రకృతి చికిత్స బాట పట్టడం వెనుక.. తెర వెనుక ఏదో భారీ నాటకమే జరిగిందన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. ఎన్నికల కోడ్ తరువాత పార్టీ పెడతా అనడం మరింత సాగదీయడానికి ఒక కారణంగా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**జగన్ నుంచి సంకేతాలు..**

అసలు విజయసాయి రెడ్డికి కొత్త పార్టీ పెట్టే ఉద్దేశం ఉందా అనే ప్రశ్న ఉత్పన్నం అవుతోంది. రాజకీయంగా ఆయన వెనక్కి తగ్గడానికి కారణం తిరిగి వైసిపిలోకి వెళ్లేందుకు గ్రీన్ సిగ్నల్ లభించింది అనేది ఒక ప్రచారం. విజయసాయిరెడ్డి సొంతటి పెడితే వైసీపీ మరింత బలహీన పడుతుంది. ఇది నేరుగా టిడిపి కూటమికి లాభం చేకూర్చే విషయం. దీనిని గ్రహించిన జగన్మోహన్ రెడ్డి స్వయంగా రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. సొంత పార్టీ పెట్టవద్దు అంటూ విజయసాయి రెడ్డికి సంకేతాలు ఇచ్చినట్లు ప్రచారం నడుస్తోంది. అందుకే విజయసాయి రెడ్డి వెనక్కి తగ్గారని.. ఆయుర్వేద చికిత్స పేరుతో కొత్త నాటకానికి తెర తీశారు అనేది ఒక అనుమానం. కొత్త పార్టీ ప్రతిపాదనను తాత్కాలికంగా కోల్డ్ స్టోరేజ్ లో పెట్టి.. తిరిగి వైసీపీలో చేరేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నారు అనేది పొలిటికల్ వర్గాల్లో ఒక అనుమానం. మరి దీంట్లో ఎంత నిజం ఉందో చూడాలి..

# ఓట్ల తొలగింపుపై సవాళ్ల

హైదరాబాద్: ఓటర్ల జాబితాలో పేర్లు తొలగించారనే అంశం తెలంగాణ రాజకీయాల్లో కొత్త వివాదానికి దారితీసింది. ఒకరు ఆధారాలతో నిరూపిస్తానంటే.. మరొకరు ఎన్నికల సంఘం కార్యాలయానికి బాధితులను తీసుకురావాలని సవాల్ విసిరారు. మంత్రి పొన్నం ప్రభాకర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు మధ్య సాగుతున్న ఈ మాటల యుద్ధం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

**ఆధారాలతో వస్తా.. సిద్ధమా?**

ఓటర్ల జాబితా సవరణ పేరుతో ఓట్లను తొలగిస్తున్నారంటూ బీజేపీ చేస్తున్న ప్రచారాన్ని పొన్నం ప్రభాకర్ తప్పుబట్టారు. ఈ అంశంపై రాంచందర్ రావు బహిరంగంగా చర్చకు రావాలని సవాల్ చేశారు. తేదీ, సమయం నిర్ణయిస్తే ఓటు హక్కు కోల్పోయిన వ్యక్తులను ఆధారాలతో సహా ఆయన ముందుకు తీసుకొస్తానని ప్రకటించారు. ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో ఏవైనా పొరపాట్లు జరిగితే వాటిని సరిచేయడంపై దృష్టి పెట్టాలని సూచించారు. సమస్యను పరిష్కరించే బదులు బీజేపీ నేతలు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.

**పది మందిని తీసుకురావాలన్న బీజేపీ చీఫ్**

మంత్రి చేసిన సవాల్‌పై రాంచందర్ రావు స్పందించారు. ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించారని చెబుతున్న వారిలో కనీసం పది మందిని ఎన్నికల సంఘం కార్యాలయానికి తీసుకురావాలని ప్రతి సవాల్ విసిరారు. దీంతో ఓట్ల తొలగింపు అంశంపై అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య వివాదం మరింత ఆసక్తికరంగా మారింది. ఓటర్ల జాబితాపై స్పందించడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వంపై రాంచందర్ రావు మరో డిమాండ్‌ను ముందుకు తెచ్చారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను తెలంగాణలో తక్షణమే అమలు చేసి రైతులకు భరోసా కల్పించాలని కోరారు. ఈ పథకాన్ని అమలు చేయకపోతే పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ పథకం నుంచి వైదొలగగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తిరిగి ఇందులో చేరాలని ఈ ఏడాది మార్చిలో నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఓటర్ల జాబితా సవరణపై పరస్పర సవాళ్లు, రైతుల బీమా అంశంపై డిమాండ్లతో తెలంగాణ రాజకీయాల్లో ఈ వ్యవహారం ప్రాధాన్యం సంతరించుకుంది.

# కేటీఆర్ చుట్టూ ఫార్ములా- ఈ రేసు ఉచ్చు!

రద్దు చేయాలంటూ హైకోర్టుతో పాటు దేశ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు వరకు వెళ్లి విఫలమయ్యారు. మళ్లీ ఇప్పుడు కొత్తగా నాంపల్లి కోర్టులో డిశ్చార్జ్ పిటిషన్ దాఖలు చేయడం విశేషం.

**అప్పట్లో ఎఫ్ఐఆర్ను రద్దు చేయాలని..**

భారత న్యాయవ్యవస్థలో ఎఫ్ఐఆర్ ను కొట్టి వేయాలని వేసే క్వాష్ పిటీషన్ పరిధి వేరు. చార్జ్ షీట్ దాఖలయ్యాక వేసే డిశ్చార్జ్ పిటిషన్ పూర్తిగా వేరు. గతంలో కేటీఆర్ సుప్రీంకోర్టు వరకు వెళ్ళింది కేవలం ఏసీబీ నమోదు చేసిన ప్రాథమిక ఎఫ్ఐఆర్ను రద్దు చేయాలన్న అభ్యర్థనతో మాత్రమే. అప్పట్లో దర్యాప్తు ఇంకా ప్రాథమిక దశలోనే ఉందని.. నేరం జరిగిందా లేదా అన్నది తేలడానికి దర్యాప్తును ఆపలేమని స్పష్టం చేస్తూ కోర్టు ఆ క్వాష్ పిటీషన్లను కొట్టివేసింది. అయితే ఇప్పుడు ఏసీబీ తమ సమగ్ర విచారణను పూర్తి చేసి తుది చార్జెస్ కోర్టు ముందు ఉంచినందున.. చట్టపరంగా నిందితుడికి ట్రయల్ ప్రారంభం కాకముందే డిశ్చార్జ్ పిటిషన్ వేసే సంపూర్ణ హక్కు ఉంటుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. కేవలం సాంకేతిక, విధానపరమైన అంశాల చుట్టూ కేటీఆర్ లేవనెత్తిన ప్రధాన వాదనలు తిరుగుతున్నాయి.

**టెక్నికల్ అంశాలతో..**

గులాబీ ప్రభుత్వ హయాంలో ఫార్ములా ఈ రేస్ నిర్వహణ జరిగింది. అయితే ఇది రాష్ట్ర ప్రతిష్టను పెంచేందుకు తీసుకున్న ప్రభుత్వ విధానపరమైన నిర్ణయం తప్ప.. అందులో వ్యక్తిగత అవినీతి లేదా క్విడ్ ప్రో కో లేదని ఆయన న్యాయవాదులు వాదించనున్నారు. ప్రాథమిక ఆధారాలు లేవని.. అలాంటప్పుడు తనను విచారణకు పంపడం నిరార్థకమని కేటీఆర్ వాదించవచ్చు. న్యాయస్థానం నిందితులపై అభియోగాలు నమోదు చేయడానికి ముందే.. ఆ పత్రాల ఆధారంగా తనను కేసు నుంచి విముక్తి చేయాలని కోరడం ఒక వ్యూహాత్మక అస్త్రం. అయితే కేటీఆర్ కు ఊరట లభించడం అంత ఈజీ కాదు. డిస్చార్జ్ పిటిషన్ దశలో న్యాయస్థానం సాక్ష్యాధారాలు లోతుల్లోకి వెళ్లి వాటి బలాబలాలను నిర్ణయించదు.

# ఓటర్ల జాబితాపై పోరు..

న్యూఢిల్లీ: ఓటర్ల జాబితా రూపకల్పన చుట్టూ మొదలైన వివాదం ఇప్పుడు న్యాయస్థానం ముందుకు చేరింది. ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయన్న ఆరోపణలతో ఇండియా కూటమి నేతలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సహా మొత్తం 11 మంది నాయకులు సోమవారం రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దీంతో ఎస్ఐఆర్ వ్యవహారం రాజకీయ వేదిక నుంచి న్యాయపరమైన దశకు చేరింది.

**కీలక అధికారులను ప్రతివాదులుగా చేర్చిన నేతలు**

ఈ పిటిషన్‌లో ఎన్నికల సంఘంతో పాటు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషిలను ప్రతివాదులుగా పేర్కొన్నారు. కాంగ్రెస్‌తో పాటు సమాజ్‌వాదీ పార్టీ, ఆర్జేడీ, తృణమూల్ కాంగ్రెస్, శివసేన (యూబీటీ), సీపీఎం, సీపీఐ, జేఎంఎం, ఎన్సీపీ (ఎస్పీ), ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్‌కు చెందిన నేతలు ఈ న్యాయపోరాటంలో భాగస్వాములయ్యారు. పిటిషన్‌లో ప్రధానంగా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో జరుగుతున్నాయని వారు పేర్కొంటున్న అక్రమాలపై అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టాల్సి ఉంది.

**సీజేఐకి లేఖ.. ఆ తర్వాత పిటిషన్**

అంతకుముందు ఢిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో రాహుల్ గాంధీ ఈ అంశంపై మాట్లాడారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి తమ ఆందోళనలను వివరిస్తూ భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌కు లేఖ రాసినట్లు వెల్లడించారు. అధికారికంగా పిటిషన్ దాఖలు చేసి న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని సూచన వచ్చిన నేపథ్యంలో ఈ చర్య తీసుకున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ప్రజాస్వామ్య పరిరక్షణ కీలకమని పేర్కొన్న రాహుల్.. రాజ్యాంగాన్ని కాపాడే ప్రయత్నంలో ప్రజలు తమకు మద్దతుగా నిలవాలని కోరారు. అనంతరం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో విపక్ష నాయకులు సుప్రీంకోర్టు దిశగా నిరసన ర్యాలీ నిర్వహించారు.

**రాజకీయ ప్రయోజనాల కోసమే ఆరోపణలు: బీజేపీ**

మరోవైపు, ఇండియా కూటమి నేతల వాదనలను బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి గురు ప్రకాశ్ పాశ్వాన్ ఖండించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై విపక్షాలు చేస్తున్న ఆరోపణలకు ఆధారాలు లేవని ఆయన విమర్శించారు. ఈ అంశంపై సుప్రీంకోర్టు ఇప్పటికే నిర్ణయం వెలువరించిందని ఐఏఎన్ఎస్‌తో మాట్లాడుతూ పేర్కొన్నారు. అస్సాంలోని సిల్చార్‌తో పాటు త్రిపుర, హిమాచల్ ప్రదేశ్‌లలో జరిగిన స్థానిక ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ఓటమి పాలైందని ఆయన వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో ఎదురవుతున్న పరాజయాల నేపథ్యంలోనే విపక్షాలు ఎన్నికల సంఘంపై విమర్శలు చేస్తున్నాయని ఆరోపించారు. ఒకవైపు ఎస్ఐఆర్ ప్రక్రియపై న్యాయపరమైన జోక్యం కోరుతూ ఇండియా కూటమి ముందుకెళ్తుండగా, మరోవైపు విపక్షాల వాదనలను బీజేపీ రాజకీయ ఆరోపణలుగా అభివర్ణిస్తోంది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టులో పిటిషన్ విచారణపై ఆసక్తి నెలకొంది.

# ఓట్ల తొలగింపుపై రేవంత్ ఫైర్..



(మొదటి పేజీ తరువాయి)

ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన రేవంత్ రెడ్డి.. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఈడీ, సీబీఐ, ఆదాయపు పన్ను శాఖల తర్వాత ఇప్పుడు ఎన్నికల సంఘాన్ని కూడా రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ద్వారా బీజేపీని వ్యతిరేకించే వ్యక్తుల ఓటు హక్కును తొలగించే ప్రయత్నం జరుగుతోందని ఆయన పేర్కొన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఈ వ్యవహారంలో కీలక పాత్ర పోషిస్తున్నారని ఆరోపించారు. ఈ ఆరోపణలకు సంబంధించి ఎన్నికల సంఘం స్పందనను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంది.

**పేదలు, నిరుద్యోగుల ఓట్లపై ఆందోళన**

ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ఉద్దేశం అర్హులైన పౌరులకు ఓటు హక్కు కల్పించడం కావాలని రేవంత్ రెడ్డి అన్నారు. అయితే ప్రస్తుత ప్రక్రియను అందుకు విరుద్ధంగా ఉపయోగిస్తున్నారని విమర్శించారు. బీజేపీకి వ్యతిరేకంగా ఉన్న యువత, ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల ఓటు హక్కుకు ముప్పు ఏర్పడుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించే విషయంలో పారదర్శకత ఉండాలని, అర్హులైన ఓటర్లకు అన్యాయం జరగకూడదని పేర్కొన్నారు.

**ఎన్నికల కమిషనర్ల మధ్య విభేదాలున్నాయా?**

ఎన్నికల సంఘంలోని ఇతర ఇద్దరు కమిషనర్లు సర్ ప్రక్రియలోని లోపాలను వ్యతిరేకించారని రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ పరిణామాలు ప్రధాన ఎన్నికల కమిషనర్ తీసుకుంటున్న నిర్ణయాలపై సందేహాలు కలిగిస్తున్నాయని వ్యాఖ్యానించారు. జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించే విషయంలో ప్రధాని మోదీ ఎందుకు వెనుకడుగు వేస్తున్నారని ప్రశ్నించారు. అయితే కమిషనర్ల మధ్య విభేదాలు, నిర్ణయాలపై ఆయన చేసిన వ్యాఖ్యలను స్వతంత్రంగా నిర్ధారించాల్సి ఉంది.

**మరో స్వాతంత్ర్య పోరాటమంటూ పిలుపు**

ఓటు హక్కును కాపాడుకునే పోరాటాన్ని రేవంత్ రెడ్డి మరో స్వాతంత్ర్య సంగ్రామంతో పోల్చారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన 'జ్ఞానేశ్ కుమార్ గో బ్యాక్' ఉద్యమానికి మద్దతు ప్రకటించారు. గతంలో జ్ఞానేశ్ కుమార్ నియామకాన్ని రాహుల్ గాంధీ వ్యతిరేకించిన విషయాన్ని కూడా ప్రస్తావించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని పేర్కొంటూ, అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సర్ ప్రక్రియపై కాంగ్రెస్, కేంద్ర ప్రభుత్వం మధ్య కొనసాగుతున్న వివాదం మరింత రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది.

# కూటమిలో సీట్ల సర్దుబాటు!

(మొదటి పేజీ తరువాయి)

క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో: స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఏ క్షణం అయినా నోటిఫికేషన్ జారీ కానుంది. ఈ తరుణంలో అధికార కూటమి అస్త్ర శస్త్రాలు సిద్ధం చేస్తోంది. క్లీన్ స్వీప్ చేయడమే లక్ష్యంగా ప్రణాళికలు రచిస్తోంది. అందులో భాగంగా స్థానిక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, సీట్ల సర్దుబాటు కొలిక్కి తెచ్చేందుకు టిడిపి అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ సోమవారం భేటీ అయ్యారు. ఇప్పటికే పల్లా శ్రీనివాసరావు నేతృత్వంలోని కూటమి రాష్ట్రస్థాయి సమన్వయ కమిటీ మూడు పార్టీల బలాబలాలపై.. క్షేత్రస్థాయి నివేదికను సిద్ధం చేసి అధినేతలకు అందించింది.

**ముందుగా పుర పోరు**

స్థానిక ఎన్నికల్లో భాగంగా ముందుగా మున్సిపాలిటీలకు ఎన్నిక జరగనుంది. అందుకే మున్సిపల్ ఎన్నికల సీట్ల పంపకంపై కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. కార్పొరేషన్లలో మేయర్ స్థానాలు, మున్సిపల్ చైర్మన్లు తో పాటు డివిజన్లు, వార్డుల్లో ఎవరెవరికి కేటాయింపులు అనేదానిపై స్పష్టత రానుంది. 2024 అసెంబ్లీ ఎన్నికల నాటి త్యాగాలు, ఓటు బ్యాంకు బదిలీని ప్రామాణికంగా తీసుకుంటూనే.. క్షేత్రస్థాయిలో పార్టీల గెలుపు గుర్రాలకే ప్రాధాన్యం ఇచ్చేలా ఫార్ములా అను రూపొందించినట్లు సమాచారం.

**మూడు పార్టీల జాబితాలు..**

పైగా మూడు పార్టీలు జాబితాలతో సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లా, నియోజకవర్గస్థాయి నేతల నుంచి అందిన వినతులు, డిమాండ్ల ఆధారంగా తయారుచేసిన అభ్యర్థుల ప్రాథమిక జాబితాలను పల్లా శ్రీనివాసరావు కమిటీ సమర్పించింది. సీట్ల కేటాయింపులో ఎలాంటి మనస్పర్ధలు రాకుండా, అసమ్మతి చెలరేగకుండా అత్యంత జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారు. మూడు పార్టీల సమన్వయంతో క్షేత్రస్థాయిలో ఓట్లు గుంప గుత్తగా కూటమి అభ్యర్థులకు పడేలా నియోజకవర్గాల వారీగా జాయింట్ ఆక్షన్ కమిటీలను ఏర్పాటు చేసే ప్రణాళికను కూడా ఈ సమావేశంలో ఖరారు చేయనున్నారు.

**అధికారిక ప్రకటన..**

నోటిఫికేషన్ వెలువడిన తర్వాత.. కూటమికి సంబంధించి మేయర్, మున్సిపల్ చైర్మన్ స్థానాల కేటాయింపు పై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వం, చంద్రబాబు అపార పాలన అనుభవం, పవన్ కళ్యాణ్ ప్రజాదరణ కలగలిపి కూటమిని స్థానిక పోరులో తిరుగులేని శక్తిగా నిలబెడతాయని కూటమి పార్టీ శ్రేణులు భీమా వ్యక్తం చేస్తున్నాయి.

# ఓట్ల అక్రమాలపై ఆధారాలుంటే చూపించండి..



ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని చెబుతున్నారా? అయితే మీ దగ్గర ఉన్న ఆధారాలను సంబంధిత అధికారుల ముందుంచి నిరూపించండి. అంతేకానీ, నిరసనల పేరుతో సామాన్య ప్రజల రాకపోకలకు ఆటంకం కలిగించడం ఎంతవరకు సమంజసమని బీజేపీ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ ప్రతిపక్షాలను ప్రశ్నించారు. ఢిల్లీలో ఇండియా కూటమి చేపట్టిన ఆందోళనలపై స్పందించిన ఆయన.. ఆరోపణలు చేసే విధానం కంటే వాటిని నిరూపించే ఆధారాలే ముఖ్యమని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియపై అభ్యంతరాలు ఉన్నవారు ముందుగా ఎన్నికల సంఘం నుంచి అపాయింట్‌మెంట్ తీసుకోవాలని ఈటల సూచించారు. తమ వద్ద ఉన్న ఆధారాలను అధికారులకు అందించి, వాటి ఆధారంగా సమస్యను ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేసేలా వీధుల్లో ఆందోళనలు చేయడం సరైన పద్ధతి కాదని అభిప్రాయపడ్డారు.

**బీహార్ ఫలితాల నుంచి పాఠం నేర్చుకోవాలి:** గతంలో బీహార్ ఎన్నికల సమయంలోనూ ఓట్ల అక్రమాలపై ప్రతిపక్షాలు ఆరోపణలు చేశాయని ఈటల గుర్తుచేశారు. ఆ ఎన్నికల ఫలితాలను దృష్టిలో పెట్టుకుని ఇండియా కూటమి తమ పోరాట పద్ధతిని సమీక్షించుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో నిరసనలకు అవకాశం ఉన్నప్పటికీ, అవి ప్రజలకు ఇబ్బందులు కలిగించకుండా బాధ్యతాయుతంగా సాగాలని పేర్కొన్నారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో ఇండియా కూటమి 'చలో ఢిల్లీ -- మార్చ్ ఫర్ డెమోక్రసీ' కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా సుప్రీంకోర్టు దిశగా పాదయాత్రకు పిలుపునిచ్చింది. ఈ నిరసనల నేపథ్యంలో రాజధానిలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించడంతో పాటు కొన్ని మెట్రో స్టేషన్లను మూసివేశారు. ఈ పరిణామాల వల్ల నగరవాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రతిపక్ష నేతలు పరిగణనలోకి తీసుకోవాలని ఈటల రాజేందర్ వ్యాఖ్యానించారు.

# రేడియల్ రోడ్ టెండర్లపై రగడ..

(మొదటి పేజీ తరువాయి)

అధికార పార్టీలో కొత్త వివాదానికి తెరలేపింది. రూ.3,296 కోట్ల విలువైన రేడియల్ రోడ్-2 పనుల కేటాయింపులో అక్రమాలు జరిగాయంటూ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

**రూ.600 కోట్ల వ్యత్యాసంపై ప్రశ్నలు**

హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) ఆధ్వర్యంలో నిర్వహించిన టెండర్ల ప్రక్రియలో తమ సంస్థకు అన్యాయం జరిగిందని రాజగోపాల్ రెడ్డి ఆరోపించారు. మూడు ప్యాకేజీలకు సంబంధించి ఇతర సంస్థలతో పోలిస్తే రూ.600 కోట్లు తక్కువ మొత్తానికి తమ కంపెనీ బిడ్లు సమర్పించినప్పటికీ, నిబంధనల పేరుతో పోటీ నుంచి తప్పించారని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర పరిశీలన జరగాలని ఆయన డిమాండ్ చేశారు. సొంత ప్రభుత్వంలోనే ఇలాంటి పరిణామాలు చోటుచేసుకోవడం బాధ కలిగిస్తోందని వ్యాఖ్యానించారు.

**సీఎం కార్యాలయం నుంచి ఫోన్లు వచ్చాయా?**

టెండర్లలో పాల్గొనవద్దంటూ ముఖ్యమంత్రి



కార్యాలయం నుంచి తనకు ఫోన్ కాల్స్ వచ్చినట్లు రాజగోపాల్ రెడ్డి వెల్లడించారు. అయినప్పటికీ తమ సంస్థ పోటీలో కొనసాగిందని చెప్పారు. ముఖ్యమంత్రి పర్యవేక్షణలో ఉండే శాఖ పరిధిలోనే ఇలాంటి పరిణామాలు చోటుచేసుకోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. తమ సంస్థను అనర్హంగా ప్రకటించడానికి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అయితే టెండర్లలో అవకతవకలు జరిగాయన్నది ఆయన చేసిన ఆరోపణ మాత్రమే. వాటిపై స్వతంత్రంగా నిర్ధారణ జరిగినట్లు అందించిన సమాచారం ఆధారంగా చెప్పలేం.

**రాహుల్ గాంధీకి ఫిర్యాదు.. సుప్రీంకోర్టు వరకు పోరాటం**

ఈ అంశాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళ్తానని రాజగోపాల్ రెడ్డి ప్రకటించారు. అవసరమైతే సుప్రీంకోర్టు వరకు వెళ్లి న్యాయపరంగా పోరాడతానని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చోటుచేసుకున్న పరిణామాలను ఈ వ్యవహారం గుర్తు చేస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. తప్పు చేసినవారు ఎవరైనా ప్రశ్నిస్తానని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విషయంలోనూ తన వైఖరిలో మార్పు ఉండదని పేర్కొన్నారు.

**కాంగ్రెస్‌లో ఉంటూనే పోరాటం**

ఢిల్లీలో పార్టీ చేపట్టే నిరసన కార్యక్రమంలో పాల్గొనే పరిస్థితి ఎలా ఉంటుందని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వంలో అవినీతి జరుగుతోందని తాను భావిస్తున్న సమయంలో దానిపై ప్రశ్నించకుండా ఉండలేనని తన వ్యాఖ్యల ద్వారా స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూనే అవకతవకలపై పోరాటం చేస్తానని రాజగోపాల్ రెడ్డి ప్రకటించడంతో ఈ టెండర్ల వివాదం రాష్ట్ర రాజకీయాల్లో చర్చకు దారితీసింది. ఆరోపణలపై ప్రభుత్వం లేదా సంబంధిత అధికారులు ఇచ్చే వివరణ, టెండర్ల ప్రక్రియకు సంబంధించిన వాస్తవాలు ఈ వ్యవహారంలో కీలకంగా మారనున్నాయి.



## సింగరేణి లాభాల వాటాను అక్టోబర్ 15వ తేదీ లోపు ప్రకటిస్తాం: ఐఎన్టీయుసి నాయకులు

**మందమర్రి టౌన్ అక్టోబర్ 12 క్రైమ్ మిర్రర్:** సింగరేణిలో లాభాల వాటాను అక్టోబర్ 15వ తేదీ లోపు ప్రకటిస్తారని ఐఎన్టీయుసి నాయకులు కాంపల్లి సమ్మయ్య రామ్ శెట్టి నరేందర్ సోమవారం స్థానిక ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుర్తింపు సంఘం గా సింగరేణిలో ఏఐటీయూసీ విఫలమైందని అన్నారు.గుర్తింపు సంఘం కార్మిక సమస్యల కోసం పరిష్కారం చేయాలని కానీ ధర్నాలు చేయడం ఎంతవరకు సమంజసమని పేర్కొన్నారు ప్రతిపక్ష ఐఎన్టీయుసి చేయాల్సిన ధర్నాలు గుర్తింపు సంఘం చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఇటీవల మంత్రి బట్టి విక్రమార్క సింగరేణి యాజమాన్యంతో యూనియన్ నాయకులతో చర్చించి సమస్యలన్నీ పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. లాభాల వాటాను అక్టోబర్ 15వ తేదీ లోపు చెల్లించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని కార్మికులు అయోమయం పడవద్దని తెలిపారు. కొన్ని కార్మిక సంఘాల నాయకులు ప్రభుత్వంపై ఐఎన్టీయుసి పై దుష్ప్రచారం చేస్తున్నారని అది సరి కాదని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సింగరేణిలో ప్రధాన కార్యదర్శి జనప్రసాద్ ఆధ్వర్యంలో నిరంతరం ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఏరియా నాయకులు దేవి భూమయ్య,పేరం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పిట్టంపల్లిలో ఉచిత వైద్య శిబిరం



**చిట్యాల క్రైమ్ మిర్రర్:** లయన్స్ క్లబ్ ఆఫ్ చిట్యాల, యశోద మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, మలక్‌పేట్ సంయుక్త ఆధ్వర్యంలో చిట్యాల మండలం లోని పిట్టంపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కార్డియాలజీ, జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్ విభాగాలతో పాటు కంటి పరీక్షలు, బీపీ, షుగర్, కొలెస్ట్రాల్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, వ్యాధులను ముందుగానే గుర్తించేందుకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి లయన్ మదన్‌మోహన్ రేపాల, గ్రామ సర్పంచ్ అందే అండాలు రాములు, ఉపసర్పంచ్ నారగోని నాగరాజు, క్లబ్ అధ్యక్షుడు లయన్ నర్సింహా గౌడ్, కార్యదర్శి లయన్ మాధవ రెడ్డి పాటి, కోశాధికారి లయన్ కరుణాకర్ గౌడ్‌తో పాటు క్లబ్ సభ్యులు, వైద్యులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సింగూరు నీళ్లు ఎక్కడికి?

బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ప్రజల అవసరాల కంటే బీర్ తయారీ పరిశ్రమలకు ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపిస్తూ, నీటి నిర్వహణపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**సింగూరు నీటి నిల్వపై ఆందోళన**

తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన హరీశ్ రావు.. సింగూరు ప్రాజెక్టులో మరమ్మతుల పేరుతో 29 టీఎంసీల నీటిని ఖాళీ చేశారని ఆరోపించారు. అయితే పనులు పూర్తిస్థాయిలో ముగియలేదని విమర్శించారు. ప్రస్తుతం ప్రాజెక్టులో సుమారు 3 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉందని పేర్కొంటూ, ఆ నీటిని బీర్ ఫ్యాక్టరీలకు తరలిస్తున్నారని ఆరోపించారు. ఈ పరిస్థితి కొనసాగితే హైదరాబాద్‌తో పాటు రంగారెడ్డి, కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్ జిల్లాల ప్రజలకు తాగునీటి సరఫరాపై ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

**కరెంట్ కోతలపై ప్రభుత్వాన్ని నిలదీత**

రాష్ట్రంలో విద్యుత్ సరఫరా నిర్వహణ సరిగా లేదని హరీశ్ రావు విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ వైఖరి కారణంగానే కరెంట్ కోతలు పెరిగాయని ఆరోపించారు. విద్యుత్, నీటి సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఎల్ నినో ప్రభావంపై ముందస్తు హెచ్చరికలు ఉన్నప్పటికీ దేవాదుల, కల్వకుర్తి ప్రాజెక్టుల వద్ద నీటిని ఎత్తిపోసే విషయంలో ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోలేదని ఆయన విమర్శించారు. ఈ నిర్లక్ష్యం వల్లే రాష్ట్రంలో కృత్రిమ కరవు పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆరోపించారు.

**పరిశ్రమలకు నీరు.. ప్రజలకు ఇబ్బందులా?**

మద్యం తయారీ సంస్థలకు నీటి కొరత రాకూడదంటూ ఎక్సైజ్ మంత్రి చేసిన వ్యాఖ్యలను హరీశ్ రావు తప్పుబట్టారు. ప్రజల తాగునీటి అవసరాలను ముందుగా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.నీటి నిల్వలు, విద్యుత్ సరఫరా, సాగునీటి నిర్వహణ వంటి అంశాల్లో ప్రభుత్వం స్పష్టమైన ప్రణాళికతో ముందుకు రావాలని ఆయన కోరారు. సింగూరు ప్రాజెక్టులో నీటి వినియోగంపై ఆయన చేసిన ఆరోపణలు రాజకీయంగా చర్చకు దారితీశాయి. అయితే నీటి తరలింపు, ప్రాజెక్టు మరమ్మతులు, సంబంధిత పరిశ్రమలకు సరఫరా అంశాలపై పూర్తి వివరాలు స్వతంత్రంగా నిర్ధారించాల్సి ఉంది.

# తిరుమలలో కొత్త వివాదం!

(మొదటి పేజీ తరువాయి)



క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో: తిరుమల పుణ్యక్షేత్రంలో సరికొత్త వివాదం. కర్ణాటక ప్రభుత్వానికి చెందిన చారిత్రాత్మక అతిథి గృహాన్ని ఆ రాష్ట్ర పర్యాటక శాఖకు బదలాయించాలన్న కర్ణాటక ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వివాదాస్పదం అవుతోంది. దీనిపై తిరుమల తిరుపతి దేవస్థానం అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. దశాబ్దాల కిందట నాటి మైసూరు మహారాజుకు కేటాయించిన 7.5 ఎకరాల విశాలమైన భూమిలో ఈ గెస్ట్ హౌస్ను నిర్మించారు. భక్తుల వసతి నిమిత్తం, ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాల కోసం కేటాయించిన ఈ ఆస్తిని.. వాణిజ్య, పర్యాటకపరమైన అవసరాల కోసం మళ్ళించడం నిబంధనలకు విరుద్ధమని తిరుమల తిరుపతి దేవస్థానం చెబుతోంది.

**టీటీడీ సీరియస్..:** కర్ణాటక ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పై తిరుమల తిరుపతి దేవస్థానం సీరియస్ గా స్పందించింది. కర్ణాటక ప్రభుత్వానికి అధికారికంగా నోటీసులు జారీ చేయాలని నిర్ణయించింది. కర్ణాటక ప్రభుత్వం నుంచి సరైన స్పందన రాకపోతే.. నిబంధనల ఉల్లంఘన కొనసాగితే.. చట్టపరమైన చర్యలు చేపట్టి ఆగస్ట్ హౌస్ను తమ ఆధీనంలోకి తీసుకునేందుకు కూడా వెనుకడుగు వేయమని టిటిడి హెచ్చరించింది. తిరుమలలో పవిత్ర వాతావరణాన్ని కాపాడడానికి.. భక్తుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని దేవస్థానం భూములు, భవనాల విషయంలో కఠినంగా వ్యవహరించాలని టిటిడి బోర్డు భావిస్తోంది.

**కర్ణాటక ప్రభుత్వ వాదన..:** అయితే కర్ణాటక ప్రభుత్వం నుంచి భిన్న వాదన వినిపిస్తోంది. పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసి ప్రణాళికలోనే భాగంగానే ఈ బదలాయింపు ప్రక్రియ జరిగినట్లు తెలుస్తోంది. మైసూరు మహారాజు కాలంనాటి ఆస్తి హక్కులు, చట్టపరమైన అంశాలపై కర్ణాటక ప్రభుత్వం అంతర్గతంగా చర్చిస్తోంది. భక్తులకు మెరుగైన వసతులు కల్పించే క్రమంలోనే ఈ నిర్ణయం తీసుకున్నామని.. టీటీడీ లేవనెత్తిన అభ్యంతరాలపై చట్టపరమైన నిపుణులతో సంప్రదించి.. తగిన సమాధానం ఇస్తామని కర్ణాటక అధికారులు చెబుతున్నారు. తిరుమలలో ఇటువంటి ఆస్తుల నిర్వహణ విషయంలో గతంలోనూ పలుమార్లు వివాదాలు తలెత్తాయి. ప్రస్తుతం ఈ సరికొత్త వివాదం రెండు రాష్ట్రాల మధ్య చర్చనీయాంసంగా మారింది. చివరకు ఏం జరుగుతుందో చూడాలి.

# తమిళనాడులో మార్పు!

(మొదటి పేజీ తరువాయి)

సహజంగా ప్రధాని నరేంద్ర మోడీ ఆ రాష్ట్రంలో పర్యటించిన ప్రతిసారి భిన్న స్వరాలు వినిపిస్తుంటాయి. రాజకీయ ఉద్రిక్తత, వ్యతిరేకత అనేది అక్కడ కామన్ పాయింట్. ప్రధాన ప్రతిపక్షాలు, కొన్ని ప్రత్యేక సంఘాలు గో బ్యాక్ మోది అంటూ నినాదాలు చేస్తుంటాయి. ఆకాశంలో నల్ల బెలూన్లు ఎగురవేయడం, రోడ్లపై నల్ల జెండాలతో నిరసనలు తెలపడం ఆనవాయితీగా వస్తోంది. కానీ తాజాగా చెన్నై మెట్రో పేజ్ 2 ప్రారంభోత్సవం, వివిధ అభివృద్ధి కార్యక్రమాల నిమిత్తం ప్రధాని వచ్చారు. కానీ ఇప్పుడు మాత్రం అటువంటివి కనిపించకపోవడం విశేషం. ఒక విధంగా చెప్పాలంటే కొన్ని దశాబ్దాలుగా వస్తున్న సంప్రదాయానికి చెక్ పడింది. ఈ విషయంలో ముఖ్యమంత్రి విజయ్ అభినందనలు తెలపాల్సిందే.

**గతానికి భిన్నంగా.**

తమిళనాడులో గతానికి భిన్నంగా ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన కొనసాగుతోంది. ఈసారి మోడీ పర్యటనలు ఎలాంటి నిరసనలు, ఆందోళన కార్యక్రమాలు జరగలేదు. చివరకు ఎప్పుడూ వ్యతిరేకించే డీఎంకే సహా ఏ ఇతర రాజకీయ పార్టీ,




సంఘం కూడా మోడీ టూర్ను వ్యతిరేకిస్తూ నల్లజెండాలు ప్రదర్శించలేదు. విమానాశ్రయంలో ముఖ్యమంత్రి విజయ్ స్వయంగా ప్రధానికి ఘనంగా స్వాగతం పలుకారు. ఆ తరువాత ఇద్దరు నేతలు కలిసి ఒకే వేదికపై కనిపించారు. మెట్రో రైలులో కలియతిరి గారు. ఈ పరిణామాలు రాజకీయ విశ్లేషకులను సైతం ఆశ్చర్యపరిచాయి. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా.. ప్రశాంత వాతావరణంలో పర్యటన ముగియడం తమిళ రాజకీయాల్లో కొత్త ఒరవడికి నాంది పలికింది.

**మారిన సమీకరణలతో..**

తమిళనాడు రాజకీయ సమీకరణలు మారడం వల్లే ఈ కొత్త పరిణామం. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ... రాష్ట్రంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలన్న కోణంలోనే అధికారపక్షం వ్యవహరిస్తుండడం ఈ మార్పునకు కారణం. కేవలం రాజకీయ విమర్శలు, ఎడతెగని వ్యతిరేకత కంటే రాష్ట్ర ప్రయోజనాలు, అభివృద్ధి ప్రాజెక్టుల సాధనే ముఖ్యమైన భావన క్రమంగా బలపడుతోంది. గతంలో మాదిరిగా కేంద్ర నాయకత్వం పై అనవసరమైన ప్రతిఘటనను పక్కనపెట్టి.. ప్రజా సంక్షేమం, మెట్రో వంటి బృహత్తర ప్రాజెక్టుల భాగస్వామ్యం వైపు రాష్ట్ర నాయకత్వం మొగ్గు చూపడం తమిళనాడులో వస్తున్న సానుకూల మార్పునకు ఒక నిదర్శనం.

## శివాలయములో పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి



మునుగోడు క్రైమ్ మిర్రర్ : మునుగోడు మండల కేంద్రంలోని శ్రీశ్రీ శివరామ ఆలయమును ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దర్శించుకుని శివుడికి అభిషేకాలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు.దేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అమ్మ వారి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు..అమ్మవారి అనుగ్రహంతో నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు..మునుగోడు సర్పంచ్ పాలకూరి రమాదేవి నరసింహ గౌడ్,మండల నాయకులు పాల్గొన్నారు.


GHMC
hmda Growing Global
TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com
SRI SWAMI ASSOCIATES
ARCHITECTS•ENGINEERS•SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
GHMC, HMDA, DTCP, TS-bpass, Layout, Building Permissions
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

# కల్వకుర్తి కనకా పరమేశ్వరి ఆలయంలో...
# అంగరంగ వైభవంగా కొనసాగుతోన్న దేవి నవరాత్రి ఉత్సవాలు

## అర్ధనారీశ్వరి రూపంలో భక్తులకు దర్శనమిచ్చిన వాసవి మాత..





క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి: కల్వకుర్తి పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు కన్నుల పండుగగా కొనసాగుతున్నాయి. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం వాసవి మాత అర్ధనారీశ్వరి రూపంలో భక్తులకు దర్శనమివ్వడంతో ఆలయం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. అమ్మవారి దర్శనం కోసం పెద్ద సంఖ్యలో భక్తులు, మహిళలు తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి తిలకధారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. సరస్వతి శిశు మందిర్ విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ జూలూరు రమేష్ బాబు మాట్లాడుతూ.. గత 37 సంవత్సరాలుగా వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని, ఉత్సవాల్లో భాగంగా అన్నప్రసాద వితరణ చేపడుతున్నామని పేర్కొన్నారు. సోమవారం సుమారు 2,500 మందికి అన్నదానం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కల్మిచర్ల గోపాల్, కార్యదర్శులు నారాయణరాజు, పానుగంటి నవీన్, కోశాధికారులు గుబ్బ కిషన్, వాసా మనీష్, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వాసా శేఖర్, ఆవోప అధ్యక్షుడు కల్మిచర్ల రాఘవేందర్‌తో పాటు భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



# మండలవ్యాప్తంగా వైభవంగా దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు

క్రైమ్ మిర్రర్,సంస్థాన్ నారాయణపురం:- సంస్థాన్ నారాయణపురం మండలంలోని జనగాం, గుజ్జ, సంస్థాన్ నారాయణపురం, వావిలపల్లి, సర్వేల్, పుట్టపాక గ్రామాల్లో దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. జనగాంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో దుర్గా యూత్ ఆధ్వర్యంలో గత 30 ఏళ్లుగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం అమ్మవారిని గాయత్రీ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆయా గ్రామాల్లో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల సందర్భంగా ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. కార్యక్రమాల్లో ఎన్. శ్రీనివాసులు, వెన్‌రెడ్డి సుభాష్‌రెడ్డి, తోట చారి, బెలిదే రవి, గజవెల్లి భాస్కర్, సుధాకర్, రమేష్, నరసింహ, యాదయ్య, భవాని, పారిజాత, పావని, అంబికా, శైలజ తదితరులు పాల్గొన్నారు.

# అంబట్‌పల్లి పీహెచ్‌సీలో బతుకమ్మ సంబరాలు..!!

### సంప్రదాయబద్ధంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించిన వైద్య సిబ్బంది

### తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా పూల పండుగ సంబరాలు

### వేడుకల్లో పాల్గొన్న డాక్టర్ కళ్యాణి, స్టాఫ్ నర్స్ మరియా, ఇతర సిబ్బంది



క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం అంబట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బతుకమ్మ వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని ఆరోగ్య కేంద్రం ఆవరణలో వైద్య సిబ్బంది పండుగ వాతావరణంలో వేడుకలు జరుపుకున్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహిస్తూ పూల పండుగ విశిష్టతను చాటిచెప్పారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతితో ముడిపడిన జీవన విధానానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ రకాల పూలతో ఆకర్షణీయంగా బతుకమ్మలను అలంకరించి, వాటి చుట్టూ చేరి బతుకమ్మ పాటలు పాడుతూ సందడి చేశారు. పండుగ సంప్రదాయాలను గుర్తుచేసుకుంటూ ఆనందోత్సాహాల మధ్య వేడుకలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో అంబట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ కళ్యాణి, స్టాఫ్ నర్స్ మరియా, తదితర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. విధి నిర్వహణలో ప్రజలకు వైద్య సేవలు అందించే సిబ్బంది, తమ రోజువారీ బాధ్యతల మధ్య సాంస్కృతిక వేడుకలకు సమయం కేటాయించడం ప్రత్యేకతను సంతరించుకుంది. పండుగలు ఉద్యోగుల్లో ఉత్సాహాన్ని నింపడంతో పాటు పరస్పర స్నేహభావాన్ని, ఐక్యతను పెంపొందిస్తాయని ఈ వేడుకలు చాటిచెప్పాయి. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతికి ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన పూల పండుగ. ప్రకృతిలో లభించే వివిధ రకాల పూలను పూజించడం, మహిళలు ఒకచోట చేరి పాటలు పాడుతూ సంప్రదాయాలను కొనసాగించడం ఈ పండుగలోని ప్రత్యేకత. తరతరాలుగా వస్తున్న ఈ సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాలకు అందించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా పలువురు అభిప్రాయపడ్డారు. మొత్తంగా అంబట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలు ఆహ్లాదకరమైన వాతావరణంలో కొనసాగాయి. పూల అందాలు, బతుకమ్మ పాటలు, సిబ్బంది ఉత్సాహంతో ఆరోగ్య కేంద్రం ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది.

# సిఈసిసి జ్ఞానేశ కుమార్‌ను తొలగించే వరకు నిరసనలు ఆగవు: నీలం మధు

## ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేతలతో కలిసి నిరసన మార్చ్‌లో పాల్గొన్న నీలం మధు

## ఓటు హక్కుల పరిరక్షణ కోసం పోరాటం ఉధృతం చేస్తాం: నీలం మధు

సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ప్రతినిధి 12: కేంద్ర ఎన్నికల సంఘం తీరును నిరసిస్తూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన మార్చ్‌లో మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి నీలం మధు ముదిరాజ్ పాల్గొన్నారు. ఢిల్లీలోని బారాఖంబా జంక్షన్ నుంచి సుప్రీంకోర్టు వరకు నిర్వహించిన ఈ నిరసన ప్రదర్శనలో కాంగ్రెస్ అగ్రనేతలు, వేలాది మంది పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముందు తెలంగాణ భవన్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పిసిసి నాయకులు, రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్య నేతలతో జరిగిన సమావేశంలో నీలం మధు పాల్గొన్నారు. అనంతరం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ వాద్రా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలతో కలిసి నిరసన మార్చ్‌లో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ.. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిస్తున్నారంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిణామాలు ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. స్వతంత్రంగా వ్యవహరించాల్సిన కేంద్ర ఎన్నికల సంఘం తన రాజ్యాంగబద్ధ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించడం లేదని ఆయన ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైందని, ఆ హక్కును పరిరక్షించేందుకు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే,




ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తోందని తెలిపారు. తెలంగాణ కాంగ్రెస్ శ్రేణులు సైతం ఈ ఉద్యమంలో చురుగ్గా పాల్గొంటాయని అన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించి, ఓటర్ల జాబితాలను పారదర్శకంగా పునఃపరిశీలించే వరకు ఢిల్లీ నుంచి గ్రామస్థాయి వరకు నిరసన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని నీలం మధు ముదిరాజ్ స్పష్టం చేశారు.



# మూసాపేట్‌లో ఘనంగా దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు

### అమ్మవారికి తొలి పూజలు నిర్వహించిన మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్

కూకట్ పల్లి, అక్టోబర్ 12 (క్రైమ్ మిర్రర్) : కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని మూసాపేట్‌లో దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మూసాపేట్‌లోని కేపీఎం మైదానంలో యంగ్ స్టార్ యువజన సంఘం, తూము మనోజ్ కుమార్ మిత్ర మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత ఉత్సవాల్లో మూసాపేట్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ పాల్గొని అమ్మవారికి తొలి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, భక్తితో మొక్కులు సమర్పించారు. అనంతరం తూము శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ.. దుర్గామాత ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో జీవించాలని అమ్మవారిని మనస్ఫూర్తిగా ప్రార్థించినట్లు తెలిపారు. ప్రజలందరికీ అమ్మవారి కరుణాకటాక్షాలు లభించి, ప్రతి కుటుంబంలో సుఖశాంతులు వెల్లివిరియాలని కోరుకున్నారు. దసరా నవరాత్రి ఉత్సవాలు భక్తుల్లో ఆధ్యాత్మిక భావాలను పెంపొందించడంతో పాటు, ప్రజల మధ్య ఐక్యతను, సోదరభావాన్ని బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. యువత ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న ఈ ఉత్సవాల్లో స్థానికులు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. పూజా కార్యక్రమాలతో కేపీఎం మైదానంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకులు తూము సాయి, జిల్లా మనోజ్, తూము శశాంక్, వెంకటకృష్ణ, నిఖిల్, రాహుల్, దీక్షిత్, హరీష్, వంశీ, దేవేందర్, క్రాంతి, అఖిల్, శశాంక్ తదితర యువకులు, భక్తులు పాల్గొన్నారు.

# విరమల్ల పార్వతమ్మ మృతి బాధాకరం

### నివాళులు అర్పించిన పలువురు ప్రముఖులు









మునుగోడు క్రైమ్ మిర్రర్ : హైదరాబాద్ ఆటోనగర్ లో శ్రీ శిరిడి సాయి ట్రాన్స్పోర్ట్ అధినేత, మాజీ జర్నలిస్ట్ మునుగోడు మండలం కొంపెల్లి గ్రామానికి చెందిన వీరమల్ల నరసింహగౌడ్ సతీమణి వీరమల్ల పార్వతమ్మ అంత్యక్రియలు సోమవారం కుంట్లూర్ హిందూ స్మశానవాటికలో నిర్వహించారు. అంతకుముందు వారి నివాసం వద్ద పలువురు నాయకులు, పెద్ద సంఖ్యలో బంధుమిత్రులు పార్వతమ్మ పార్ధీవదేహాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళు లర్పించారు. తెలంగాణ రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ తో పాటు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం , బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, ఎల్బీనగర్ షీటీమ్ ఏసీపీ పల్లె వెంకటేశ్వర్లు, చాంద్రాయనగుట్ట డిప్యూటీ కమిషనర్ పల్లె పాపయ్య, సీనియర్ జర్నలిస్ట్ పోగుల ప్రకాష్, పాలకూరి రాజు, పలు గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచుల ఫోరమ్ మండలాధ్యక్షుడు వేదిరే విజేందర్ రెడ్డి,మారగోని అంజయ్య గౌడ్, మేకల శ్రీనివాస్ రెడ్డి,మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు తదితరులు అంత్యక్రియలల్లో పాల్గొని నివాళులర్పించారు..

# ఆడపడుచులకు బతుకమ్మ కానుక

### మహిళలకు చీరలు పంపిణీ చేసిన కాట సునీత రాజేష్ గౌడ్

అమీన్‌పూర్, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 12: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని అమీన్‌పూర్ డివిజన్ పరిధిలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు కాట సునీత రాజేష్ గౌడ్ మహిళలకు చీరలు పంపిణీ చేశారు.తెలంగాణ ఆడపడుచులు బతుకమ్మ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలనే ఉద్దేశంతో మహిళలకు చీరలను బతుకమ్మ కానుకగా అందజేశారు. ఈ సందర్భంగా మహిళలకు పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రతి ఇంట్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడంతో పాటు మహిళలతో కలిసి పండుగలను జరుపుకోవడం ఆనందంగా ఉందని కాట సునీత రాజేష్ గౌడ్ పేర్కొన్నారు. బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలకు చీరలు పంపిణీ చేయడంతో కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో కొనసాగింది.





క్రైమ్ THE మిర్రర్ ®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
మంగళవారం 13-10-2026


# కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలి

**ఓటు చోరీ అంటే ప్రజాస్వామ్యంపై దాడి - ఓటర్ల హక్కుల పరిరక్షణకు రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పోరాటం చేస్తుంది ..టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం**







**కూకట్ పల్లి, అక్టోబర్ 12 (క్రైమ్ మిర్రర్) :** తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పిలుపు మేరకు, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, టీపీసీసీ కార్యవర్గ సభ్యులు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, ఇతర పార్టీ నాయకులు పెద్ద ఎత్తున న్యూఢిల్లీలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం మాట్లాడుతూ, ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు వంటిదని, కోట్లాది మంది పౌరుల ఓటు హక్కుకు భంగం కలిగించే చర్యలు ప్రజాస్వామ్య పునాదులనే బలహీనపరుస్తాయని అన్నారు. ఓటర్ల జాబితాల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం తప్పనిసరిగా ఉండాలని, ఓట్ల తొలగింపు, ఓటర్ల హక్కులకు విఘాతం కలిగిందనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరగాలని డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాల ప్రభావంలో ఎన్నికల సంఘం పనిచేస్తోందనే అనుమానాలకు తావులేకుండా, ఎన్నికల సంఘం తన స్వతంత్రతను, నిష్పక్షపాత వైఖరిని నిరూపించుకోవాలని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్యానికి అత్యంత కీలకమైన ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లే పరిస్థితులు ఏర్పడటం దేశానికి ప్రమాదకరమని అన్నారు. "ఓటు చోరీ అంటే ప్రజల తీర్పును దొంగిలించడమే. ప్రజల ఓటు హక్కును హరించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. కోట్లాది మంది ఓటర్ల హక్కులపై ప్రశ్నలు తలెత్తుతున్నప్పుడు ఎన్నికల సంఘం మౌనంగా ఉండకూడదు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ నైతిక బాధ్యత వహించి వెంటనే రాజీనామా చేయాలి. ఆయన హయాంలో తీసుకున్న వివాదాస్పద నిర్ణయాలపై సమగ్ర, నిష్పక్షపాత పునఃసమీక్ష జరగాలి. చట్టవిరుద్ధ చర్యలు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం తగిన చర్యలు తీసుకోవాలి" అని డా. సత్యం శ్రీరంగం డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడం, రాజ్యాంగ విలువలను కాపాడటం, ప్రతి పౌరుడి ఓటు హక్కును సంరక్షించడం కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యాలని ఆయన స్పష్టం చేశారు. ప్రజల ఓటుతో ఏర్పడే ప్రభుత్వాల విషయంలో పారదర్శకత, ఎన్నికల ప్రక్రియలో నిష్పక్షపాత వైఖరి అత్యంత అవసరమని తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో దేశవ్యాప్తంగా ఇండియా కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొని న్యూఢిల్లీలో ప్రదర్శనలు నిర్వహించారు. ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం, ఓటర్ల హక్కుల పరిరక్షణ కోసం తమ నిరసనను వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, ప్రతి ఓటు విలువను కాపాడటం కోసం కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని నిరంతరం కొనసాగిస్తుందని డా. సత్యం శ్రీరంగం స్పష్టం చేశారు.

# డ్రైనేజీ సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలి

**కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**



**కూకట్ పల్లి, అక్టోబర్ 12 (క్రైమ్ మిర్రర్) :** కూకట్ పల్లి నియోజకవర్గం, కేపీహెచ్‌బీ డివిజన్‌లోని ఎల్ఐజీ 22--23 ప్రాంతంలో డ్రైనేజీ పొంగిపొర్లుతూ స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, సోమవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు తో కలిసి సమస్యాత్మక ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి డ్రైనేజీ సమస్యను తీసుకురాగా, వెంటనే స్పందించిన ఆయన సంబంధిత వాటర్‌వర్క్స్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రాంతంలో డ్రైనేజీ వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు అవసరమైన ప్రణాళికను సిద్ధం చేయాలని సూచించారు. ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు ఎందుకు తీసుకోలేదని అధికారులను ప్రశ్నించారు. సమస్య పరిష్కారంలో ఏవైనా సాంకేతిక ఇబ్బందులు లేదా ఇతర సమస్యలు ఉంటే వాటిని తన దృష్టికి తీసుకురావాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో పనిచేసి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని స్పష్టం చేశారు. అనంతరం ఆ ప్రాంతంలో కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులపై కూడా ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండా, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ అధికారులకు సూచించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో పరిష్కరించాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీ రాజేశ్ రాయ్, భవాని,వాటర్‌వర్క్స్ అధికారులు, జీహెచ్‌ఎంసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి కి రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలి

**ఏఐటీయూసీ ఆధ్వర్యంలో హైదరాబాదులోని టీఎస్ ట్రాన్స్కో జెన్కో సంస్థల ఎదుట ధర్నా**

**మందమర్రి టౌన్ అక్టోబర్ 12 క్రైమ్ మిర్రర్:** సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ యూనియన్ పిట్ సెక్రటరీ కామ్రేడ్ గొల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం కాజీపేట టు గని పై ద్వార సమావేశం నిర్వహించామని పేర్కొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్టోబర్ 13న చలో హైదరాబాద్ ధర్నా, ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.సింగరేణికి రావాల్సిన రూ.59 వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని కార్మికులకు 40 శాతం లాభాల వాటా ఇవ్వాలని అన్నారు. టీఎస్ ట్రాన్స్కో, టీఎస్ జెన్కో సంస్థల నుంచి సింగరేణి సంస్థకు రావాల్సిన రూ.59,000 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని తెలిపారు. ఈ బకాయిల సాధన కోసం అక్టోబర్ 13న హైదరాబాద్ లోని టీఎస్ ట్రాన్స్కో, టీఎస్ జెన్కో కార్యాలయాల ఎదుట నిర్వహించనున్న ధర్నా, ముట్టడి కార్యక్రమంలో సింగరేణి కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.సింగరేణి సంస్థ ఆర్జించిన మొత్తం లాభాలను బహిరంగంగా ప్రకటించాలని, కార్మికులకు 40 శాతం లాభాల వాటా చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.సంస్థ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న కార్మికులకు న్యాయమైన లాభాల వాటా అందేలా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని చెప్పారు.అక్టోబర్ 9వ తేదీన జరిగిన టిఎస్ ఆర్టీసీ ఎన్నికల్లో ఏఐటీయూసీ విజయోత్సవాలు టిఎస్ ఆర్టీసీ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో తెలంగాణవ్యాప్తంగా ఏఐటీయూసీ ఘన విజయం సాధించిన సందర్భంగా కాసిపేట-టు గనిలో బాణసంచా కాల్చి, కార్మికులకు స్వీట్లు పంపిణీ చేస్తూ విజయోత్సవాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పిట్ కమిటీ ఉపాధ్యక్షులు కొండపల్లి నరసయ్య, అసిస్టెంట్ పిట్ సెక్రటరీలు బొద్దుల వెంకటేష్, బొమ్మకంటి సాగర్, షిఫ్ట్ ఇన్‌చార్జి అరుణ్ కుమార్, కమిటీ సభ్యులు రాజ కొమురయ్య, రవి, మణికంఠ,



క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం
తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.
క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.
తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.
న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.
స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.
సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.
సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.
ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.
9393929595

# కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజలకు అండగా ఉంటుంది

**గాయత్రి నగర్‌లో భాగ్యనగర్ హౌసింగ్ సొసైటీ భూ సమస్యను పరిశీలించిన బండి రమేష్**




**కూకట్ పల్లి, అక్టోబర్ 12 (క్రైమ్ మిర్రర్) :** కూకట్ పల్లి నియోజకవర్గం, గాయత్రి నగర్ డివిజన్ పరిధిలోని సర్వే నంబర్ 1007లో ఉన్న భాగ్యనగర్ హౌసింగ్ సొసైటీ భూమికి సంబంధించిన సమస్యను టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ సోమవారం పరిశీలించారు.ఈ సందర్భంగా భూ సమస్యకు సంబంధించిన వివరాలను స్థానిక నాయకులను అడిగి తెలుసుకున్నారు. సమస్యకు సంబంధించిన అంశాలపై నాయకులతో చర్చించి, స్థానికంగా నెలకొన్న పరిస్థితులను సమీక్షించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమస్య పరిష్కారానికి సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. స్థానిక ప్రజలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని బండి రమేష్ తెలిపారు. ప్రజల సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య, గాయత్రి నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మస్తాన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వేముల సత్యం, రాఘవేంద్రరావు, కనకయ్య, విట్టల్ రెడ్డి, ఇంద్ర సింగ్, సుధాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## నూతనంగా నిర్మించిన 'తేజ కాటన్ మిల్స్'ను ప్రారంభించిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి

**నల్లగొండ జిల్లా క్రైమ్ మిర్రర్ :** ఉమ్మడి నల్లగొండ జిల్లా నారాయణపూర్ మండలం పుట్టపాక గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'తేజ కాటన్ మిల్స్'ను మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి ప్రారంభించారు. మిల్లు ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, మిషనరీ పని తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ, మునుగోడు నియోజకవర్గంలో పారిశ్రామిక రంగానికి పెద్దపీట వేస్తున్నామని, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ఇలాంటి పరిశ్రమలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. స్థానిక రైతులు పండించే పత్తికి మంచి గిట్టుబాటు ధర లభించడంతో పాటు, రవాణా ఖర్చులు కూడా తగ్గుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పుట్టపాక సర్పంచ్ గజం అనిత సత్యనారాయణ, నారాయణపురం సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి, జనగాం సర్పంచ్ లోడే రఘు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కరెంటోత్ శ్రీనివాస్ నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి దేప ప్రవీణ్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రెడ్డి నాయక్, నోముల మాధవరెడ్డి,యాజమాన్యం , సరభు సత్యనారాయణ, పేరం వీరారెడ్డి,పాల్గొన్నారు..

# శాతవాహన నగర్ కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో నూతన వసతి గృహం

**ప్రారంభించిన పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ**



**కూకట్ పల్లి, అక్టోబర్ 12 (క్రైమ్ మిర్రర్) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం, శంషిగూడ, హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని హెచ్‌ఎంటీ శాతవాహన నగర్ కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన దుకాణాలు, సిబ్బంది వసతి గృహాన్ని మాజీ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, నార్నె శ్రీనివాస రావు, ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ గాంధీ మాట్లాడుతూ హెచ్‌ఎంటీ శాతవాహన నగర్ కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన దుకాణాలు, సిబ్బంది వసతి గృహాన్ని ప్రారంభించుకోవడం చాలా సంతోషంగా ఉంది అని, సిబ్బంది కి వసతి కల్పించడం గొప్ప విషయం అని, నేటితో అందుబాటులోకి రావడం జరుగుతుంది అని ఆయన తెలియచేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంటీ శాతవాహన నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులైన అధ్యక్షులు పి. రత్న ప్రసాద్, ఉపాధ్యక్షులు ఎం. బాబు రావు, ప్రధాన కార్యదర్శి ఎం. యాది రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శులు వి. వెంకట రావు, ఎస్. రామనాథం తో పాటు, హెచ్‌ఎంటీ శాతవాహన నగర్ హౌస్ బిల్డింగ్ సొసైటీ కార్యవర్గ సభ్యులు, ఉమా మహేశ్వర ఆలయ కార్యవర్గ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# బాలానగర్‌లో మహిళ అదృశ్యం.. ఆచూకీ కోసం పోలీసుల దర్యాప్తు

**బాలానగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు**



**బాలానగర్, అక్టోబర్ 12 (క్రైమ్ మిర్రర్) :** హైదరాబాద్‌లోని బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళ అదృశ్యమైన ఘటన వెలుగులోకి వచ్చింది. బాలానగర్‌లోని వినాయక్ నగర్, రోడ్ నంబర్ 10కు చెందిన నారాయణమ్మ (64) సోమవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. ఈ ఘటనపై ఆమె కుమారుడు జోడు శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. నారాయణమ్మ అక్టోబర్ 12వ తేదీ ఉదయం సుమారు 7.15 గంటలకు ఎప్పటిలాగే ఇంటి నుంచి బయటకు వెళ్లారు. అయితే, ఎంతసేపటికీ ఆమె తిరిగి ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. వెంటనే చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు బంధువుల ఇళ్లలోనూ వెతికారు. అయినప్పటికీ ఆమె ఆచూకీ లభించలేదు. ఆమె తన చరవాణిని సైతం ఇంట్లోనే వదిలి వెళ్లినట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు. దీంతో అదృశ్యమైన మహిళ కుమారుడు జోడు శ్రీనివాస్ అదే రోజు ఉదయం సుమారు 11 గంటల సమయంలో బాలానగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు మహిళ అదృశ్యమైన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఆమె ఆచూకీ తెలుసుకునేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నారు.

# చట్టసభల్లో భట్రాజుల సత్తా చాటాలి

**రాజకీయ, సామాజిక రంగాల్లో రాణిస్తూ ఐక్యతతో ముందుకు సాగాలి: బొల్లెపల్లి సీతారామరాజు**

**మేడ్చల్ జిల్లా భట్రాజు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా ఆత్మీయ అభినందన సభ -- రాష్ట్రస్థాయి పదవులు చేపట్టిన ప్రతినిధులకు ఘన సన్మానం**



**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 12 (క్రైమ్ మిర్రర్):** భట్రాజు సమాజం ఐక్యంగా ముందుకు సాగుతూ చట్టసభల్లో తమ గొంతుకను వినిపించాలని, రాజకీయ, సామాజిక రంగాల్లో సత్తా చాటాలని భట్రాజు సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి, రంగారెడ్డి జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు బొల్లెపల్లి సీతారామరాజు పిలుపునిచ్చారు. సమాజానికి ఉన్న విశిష్టమైన గుర్తింపును కాపాడుకుంటూ, ఐక్యతతో అభివృద్ధి పథంలో పయనించాలని ఆయన ఆకాంక్షించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారంలోని కృషి ఉన్నత పాఠశాలలో ఆదివారం మేడ్చల్ జిల్లా భట్రాజు సంఘం (పశ్చిమ శాఖ) ఆధ్వర్యంలో ఆత్మీయ అభినందన, సన్మాన సభ ఘనంగా నిర్వహించారు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి ఎన్నికల్లో జిల్లా నుంచి రాష్ట్ర కార్యవర్గంలో వివిధ పదవులకు ఎన్నికైన, నియమితులైన ప్రతినిధులను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమానికి బొల్లెపల్లి సీతారామరాజుతో పాటు రాష్ట్ర సంఘం సహాధ్యక్షుడు వ్యాసభట్టు వెంకటరమణ రాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బొల్లెపల్లి సీతారామరాజు మాట్లాడుతూ.. భట్రాజు సమాజం పూర్వం నుంచి పండిత సమాజంగా విశిష్ట గుర్తింపును సంపాదించుకుందని పేర్కొన్నారు. ఆ ఘనమైన వారసత్వాన్ని భావితరాలకు అందించడంతో పాటు, సంఘ సభ్యులు అన్ని రంగాల్లో తమ ప్రతిభను చాటాలని సూచించారు. కులబంధువుల మధ్య ఐక్యత, పరస్పర సహకారం బలోపేతం కావాలని, రాజకీయాల్లోనూ సముచిత ప్రాతినిధ్యం సాధించే దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. భట్రాజు సంఘానికి ప్రాధాన్యతనిస్తూ, సమాజ అభ్యున్నతికి కృషి చేసే ప్రభుత్వాలకు సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. సంఘ సేవకు గుర్తింపు.. రాష్ట్రస్థాయి బాధ్యతలు గతంలో జిల్లా అధ్యక్షుడిగా సేవలందించి, తాజాగా రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమితులైన కూరపాటి కరుణాకర్ రాజు మాట్లాడుతూ.. గత రెండున్నర దశాబ్దాలుగా సంఘ బలోపేతానికి అంకితభావంతో కృషి చేస్తున్నానని తెలిపారు. తన సేవలను గుర్తించి రాష్ట్ర కార్యవర్గంలో కీలక బాధ్యతలు అప్పగించడం ఆనందంగా ఉందన్నారు. ఈ పదవి తనపై మరింత బాధ్యతను పెంచిందని, భట్రాజు సంఘ అభివృద్ధి, ఐక్యత, సంక్షేమం కోసం మరింత నిబద్ధతతో పనిచేస్తానని వెల్లడించారు. రాష్ట్ర కార్యవర్గంలో బాధ్యతలు చేపట్టిన ప్రతినిధులు రాష్ట్రస్థాయిలో వివిధ పదవులకు ఎన్నికైన, నియమితులైన వారిలో కూరపాటి కరుణాకర్ రాజు (రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు), సరికొండ శ్రీనివాసరాజు (కార్యదర్శి), చక్రాల రేవతి నంద్ (మ్యాగజైన్ కమిటీ వైస్ చైర్మన్), తంగెళ్ల రాధాకృష్ణ భట్ (జిల్లా--రాష్ట్ర సంబంధాల కమిటీ వైస్ చైర్మన్), సరస్వతి నరేందర్ రాజు (మీడియా సంబంధాల వైస్ చైర్మన్), శ్రీరామరాజు (కో-కన్వీనర్), తంగెళ్ల సుజాత (రాష్ట్ర మహిళా విభాగం ప్రచార కార్యదర్శి), బొల్లెపల్లి నాగరాజు (యువజన విభాగం ఉపాధ్యక్షుడు), తంగెళ్ల ప్రేమ్ సాయిభట్ (క్రీడల కమిటీ కార్యదర్శి) ఉన్నారు. వీరందరినీ సభలో ఘనంగా సన్మానించి, సంఘ నాయకులు, కులబంధువులు అభినందనలు తెలిపారు. సంఘ నాయకులు, మహిళా ప్రతినిధుల హాజరు

ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లోలభట్టు కృష్ణంరాజు, కార్యనిర్వాహక కార్యదర్శి పోరంకి శ్యాంప్రసాద్ రాజు, ఉపాధ్యక్షుడు ఊడుమూడి రాఘవరాజు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు బల్ల కరుణాకర్ రాజు, కార్యదర్శి భల్లం మౌనిక సాయి, రంగారెడ్డి తూర్పు జిల్లా ఉపాధ్యక్షుడు కూరపాటి శ్యాంమోహన్ రాజు పాల్గొన్నారు. అలాగే సంఘ ప్రతినిధులు వి.వి.ఎల్. నరసింహరాజు, బాహటం కృష్ణార్జునరాజు, మోగసాటి సుధీర్ రాజు, భట్టు ప్రవీణ్ రాజు, పైడికొండల జనార్దన్ రాజు, సరస్వతి అశోక్ రాజు, వేమరాజు శేషంరాజు, దశరథ దురేందర్ రాజు తదితరులు హాజరయ్యారు. జిల్లా మహిళా అధ్యక్షురాలు ఏనుగుదాటి పరమేశ్వరి, ఉపాధ్యక్షురాలు కూరపాటి పద్మావతి, కోశాధికారి భల్లం ఉషారాణి, కార్యదర్శి వడాలి సీతతో పాటు పలువురు మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు. ఐక్యత, సంఘటిత శక్తి, సమాజ అభ్యున్నతి లక్ష్యంగా సాగిన ఈ సభ ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతమైంది.



## కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటా

**బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి**

**పెరుగు సాయిలు కుటుంబానికి పరామర్శ**

**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 12:** రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అనంతారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పెరుగు సాయిలు కుటుంబాన్ని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా సాయిలు కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు, వారి కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని గోవర్ధన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. సాయిలు కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అనంతారం సర్పంచ్ కొమ్ము శీను, ఉపసర్పంచ్ యాదిరెడ్డి, స్థానిక నాయకుడు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## కుల్కచర్లలో దుర్గా భవాని మాత, పోచమ్మ అమ్మవార్లను దర్శించుకున్న శ్రీమతి ఉమా రామ్మోహన్ రెడ్డి



**క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల:** వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల కేంద్రంలో దేవీ నవరాత్రుల సందర్భంగా ప్రతిష్టించిన శ్రీ దుర్గాభవాని మాత పోచమ్మ తల్లి అమ్మవార్లను పరిగి ఎమ్మెల్యే, టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి సతీమణి శ్రీమతి ఉమా రామ్మోహన్ రెడ్డి సోమవారం భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు.ఈ సందర్భంగా అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు.అనంతరం కుల్కచర్ల మండల కేంద్రంలోని శ్రీ పోచమ్మ అమ్మవారి ఆలయాన్ని సందర్శించిన శ్రీమతి ఉమా రామ్మోహన్ రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.దేవీ నవరాత్రుల వేళ ఆలయాలకు వచ్చిన భక్తులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, అమ్మవారి అనుగ్రహం ప్రతి కుటుంబంపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, భక్తులు పలువురు ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## కపిల గిరి క్షేత్రంలో ఆంజనేయస్వామి భారీ విగ్రహ ప్రతిష్ఠాపన

**భూమిపూజలో పాల్గొన్న పరిగి ఎమ్మెల్యే సతిమణి శ్రీమతి ఉమా రామ్మోహన్ రెడ్డి**



**క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల:** వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల కేంద్రంలోని కపిల గిరి క్షేత్రం (కోతుల గుట్ట) పై శ్రీశ్రీశ్రీ ఆంజనేయస్వామి భారీ విగ్రహం సుంకిరెడ్డి ప్రకాశ్ రెడ్డి అధ్యక్షతన ప్రతిష్ఠాపన కోసం నిర్వహించిన భూమిపూజ కార్యక్రమంలో పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి సతీమణి శ్రీమతి ఉమా రామ్మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగాలని, భక్తులందరికీ ఆంజనేయస్వామి ఆశీస్సులు లభించాలని ఆమె ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అలాగే పిఏసిఎస్ చైర్మన్ బొలుసని భీమ్ రెడ్డి, బ్లాక్ బి అధ్యక్షులు కర్రే భరత్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ బిఎస్ అంజనేయులు,గ్రామ సర్పంచ్ వర్వాళ్ళ అంజిలయ్య, సుంకి రెడ్డి నర్సింహా రెడ్డి, సుంకి రెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి బిఆర్ఎస్ మండల అధ్యక్షులు శేరి రాం రెడ్డి,కాంగ్రెస్ మండల అధ్యక్షులు గోపాల్ నాయక్,దళిత సంఘాల కన్వీనర్ తుప్పలి అశోక్ కుమార్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బృంగి హరికృష్ణ, సుంకి రెడ్డి క్రిష్ణ రెడ్డి, సుంకిరెడ్డి గోవర్ధన్ రెడ్డి,సౌమ్య వెంకట్ రాంరెడ్డి,వివిధ గ్రామ సర్పంచ్ లు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు జోగు వెంకటయ్య,బొలుసని శ్రీధర్ రెడ్డి,మాజీ ఎంపీపీ అంజిలయ్య, సోషల్ మీడియా కోఆర్డినేటర్ కొమ్ము శ్రీనివాస్, తమ్మలి రాంచెంద్రయ్య,చెలిమిళ్ల ఆనందం,నాగని ఎల్లయ్య, శివాని ఎల్లయ్య, కర్రే వినోద్, మోత్కూర్ వెంకటేష్, మోర సత్యమ్మ వెంకటేష్, గాంగ్య నాయక్,రవి, లాలు నాయక్ నర్సింహా రెడ్డి, బక్కని వెంకటయ్య, తీర్పత్తయ్య, భరత్ రెడ్డి,నాగని వెంకట్రాములు, బైండ్ల రాంచెంద్రయ్య,మడిగాకాడి రాజయ్య,జెట్టిగాళ్ల వెంకటయ్య, దొమ్మ బాబు,నాగని బిచ్చయ్య,నాగని ఆంజనేయులు, ఐలాగారి కృష్ణయ్య,పోతగాళ్ల కృష్ణ,శివాని భీమయ్య,కోస్గి వెంకటయ్య,కోర్డుటి బాను,గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో గంప వెంకటేష్ గుప్తా దంపతుల ప్రత్యేక పూజలు

**భ్రమరాంబికా దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు**

**పాడిపంటలు సమృద్ధిగా పండాలి.. వర్షాలు కురవాలి: గంప వెంకటేష్ గుప్తా**



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (కడ్తాల్):** మండల కేంద్రంలోని శివాలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీ అభయాంజనేయ స్వామి, శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామివార్లకు డీసీసీబీ డైరెక్టర్, ఆమనగల్లు సింగిల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, ఆయన ధర్మపత్ని గంప వంశిక దంపతులు, గంప లక్ష్మయ్య కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శివాలయ ప్రధాన అర్చకులు వలిపే రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణల మధ్య పూజా కార్యక్రమాలు జరిగాయి. దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయ మండపంలో ప్రతిష్ఠించిన దుర్గామాత భ్రమరాంబికా దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గామాత మిత్రమండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో గంప వెంకటేష్ గుప్తా దంపతులు పాల్గొని అమ్మవారికి పూజలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గంప వెంకటేష్ గుప్తా మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో ఎండల తీవ్రత పెరిగి, వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాల నేపథ్యంలో ప్రజలు, రైతులు ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. దుర్గామాత కరుణాకటాక్షాలతో వాతావరణం చల్లబడి, సమృద్ధిగా వర్షాలు కురవాలని కోరుకున్నట్లు చెప్పారు. పాడిపంటలు సమృద్ధిగా పండి రైతుల ఇళ్లలో సిరిసంపదలు వెల్లివిరియాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, తమ పిల్లాపాపలతో సుఖసంతోషాలతో జీవించాలని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు గంప వెంకటేష్ గుప్తా దంపతులు తెలిపారు. ఈ కార్యక్రమంలో శివాలయ దేవస్థాన కమిటీ చైర్మన్ చాట్ల సర్వేశ్, కమిటీ సభ్యులు అంజయ్య శెట్టి, బుచ్చప్ప, మల్లేష్, గంప లక్ష్మయ్య ట్రస్ట్ సభ్యులు కె. శ్రీనివాస్ గుప్తా, నవీన్ గుప్తా, ఈ. రమేష్ గుప్తా, దుర్గామాత మిత్రమండలి అధ్యక్షుడు కర్ణాకర్, హనుమాన్ యూత్ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు రవీందర్ రెడ్డి, పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు అమృతం పాండు, అశోక్ రెడ్డి, జానీష్ గౌడ్, తన్వి, వార్డు సభ్యులు హెచ్.ఆర్. మహేష్, యాదగిరి, సాయి, ప్రభు, శివ, శ్రీను, మల్లేష్ గౌడ్, నేటి మల్లేష్, గూడూరు సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కనక దుర్గమ్మ ఆలయంలో కుంకుమ పూజలు

**రెండవ రోజు దసరా రాత్రి ఉత్సవాలు.. గాయత్రీ దేవిగా అమ్మవారి దర్శనం**



**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల పట్టణంలోని శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా రెండవ రోజు గాయత్రీ దేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. పులిహోర, రవ్వ కేసరిని నైవేద్యంగా సమర్పించారు. మహిళా భక్తులు విచ్చేసి కుంకుమార్చనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం అమ్మవారికి 108 ప్రసాదములతో నైవేద్యం సమర్పించనున్నట్లు ఆలయ ఛైర్మెన్ మారగోని ఆంజనేయులు గౌడ్ తెలిపారు. డైరెక్టర్లు గంజి వెంకటేశం, బుద్ధ విమల కృష్ణమూర్తి, వరకాంతం నరసింహారెడ్డి, రుద్రారపు లింగస్వామి, జిట్ట సాయిలు, బెలిదె సత్యనారాయణ, ఏళ్ల మాధవి, కుమ్మరి దేవి తోపాటు మహిళా భక్తులు... రుద్రారపు జ్యోతి, దుబ్బాక స్వప్న, దోర్నాల మంజుల, ముద్దగోని సుజాత, బొక్క మంజుల, కాచం జయశ్రీ, మందాది కృష్ణవేణి, ముద్దగోని పద్మ, మందాడి హేమలత, రెముడాల స్వప్న, గుండెగోని పూజ, ఆవనగంటి సహస్ర, ధరావత్ సింధు, దుబ్బాక సాహిత్య, దేవలపల్లి ప్రేమలత, జోగు సంతోష, పున్న చందన, ఇమ్మడి సుజాత, బూరుగు ఉష ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సేవకులు రేగొండ వేణుమాధవ్, ఈవో ఏనుగు నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న పిఎసిఎస్ వైస్ చైర్మన్ ఎల్పటి అశోక్ కుమార్ పార్టీ అధ్యక్షులు చంద్రశేఖర్

**క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల:** వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండల కేంద్రంలో పరిగి ఎమ్మెల్యే డాక్టర్ రాంమోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, చౌడాపూర్ గ్రామ సర్పంచ్ పరిగి నవీన్ కుమార్ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డులను కుల్కచర్ల పి ఎస్ సి ఎస్ వైస్ చైర్మన్ ఎల్పటి అశోక్ కుమార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చంద్రశేఖర్ సోమవారం నాయకులతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను గ్రామ ప్రజలకు వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్టి సెల్ అధ్యక్షులు శివరాం నాయక్, గ్రామ పంచాయతీ కార్యదర్శి రమేష్ రాథోడ్ ఆత్మ కమిటీ డైరెక్టర్లు రాజేందర్ రెడ్డి, సలీమ్, వెంకటయ్య మండల ప్రధాన కార్యదర్శి రాము,గ్రామ కమిటీ అధ్యక్షులు గోపాల్, వార్డు మెంబర్లు నర్సింలు, యాదయ్య, శ్రీను, మణికంఠ, మల్లేష్ లబ్ధిదారులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఓం యూత్ ఆధ్వర్యంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

**మొదటిరోజు పూజ కార్యక్రమం పాల్గొన్న వడ్డేపల్లి శ్రీశైలం దంపతులు**

**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల మండలం తాళ్ల వెల్లం ల లో ఓంకార్ యూత్ ఆధ్వర్యంలో 11 వ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు లో భాగంగా మొదటి రోజు కూడా పూజా కార్యక్రమం లో వడ్డేపల్లి శ్రీశైలం సరిత దంపతులు (మాజీ ఏకగ్రీవ సర్పంచ్ ఎంబిహెచ్ ఫౌండేషన్ చైర్మన్) పూజా కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది ఈ సందర్భంగా శ్రీశైలం మాట్లాడుతూ ప్రతి ఒక్కరిపై అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ,ఓం యూత్ ఇలాంటి కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం నిర్వహించాలని ఆయన కోరుకున్నారు ఈ కార్యక్రమంలో ఓంకార్ యూత్ అధ్యక్షుడు మలింగ కృష్ణ కాంత్, పి. శివ, ఎన్.శివ, బిక్షం, ఎన్. సాయి గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు



# ఓటర్ల శుద్ధీకరణ నిరంతర ప్రక్రియ

## అసలైన ఓటు చోరీ కాంగ్రెస్ పార్టీయే.. బిజెపి అధ్యక్షులు రాచకొండ యాదగిరి బాబు..



**జగిత్యాల జిల్లా బ్యూరో (క్రైమ్ మిర్రర్):** ఓటర్ల శుద్ధీకరణ అనేది నిరంతర ప్రక్రియ అని అది భారత ఎన్నికల సంఘం యొక్క ప్రధాన విధి ఓటర్ల శుద్ధీకరణ అనేది నరేంద్ర మోదీ ప్రధాని అయ్యాక కొత్తగా జరుగుతున్న కార్యక్రమం కాదని కాంగ్రెస్ హాయంలో ఎనిమిది సార్లు జరిగిందని దానిని ప్రధానమంత్రికి ఆపాదించి ఇండి కూటమి పార్టీలు నిరసనలు చేయడం సిగ్గుచేటని బిజెపి జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు విమర్శించారు. ఈ సందర్భంగా జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 1982లో ప్రధానమంత్రి గా ఇందిరాగాంధీ ఉన్న సమయంలో కేరళలోని పర్వూర్ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికల్లో 50 పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలను ప్రయోగాత్మకంగా వినియోగించారని 1983లో చట్టపరమైన అనుమతి కావాలని సుప్రీంకోర్టు ఆదేశించడంతో ఆపేశారని 1988లో రాజీవ్ గాంధీ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో ప్రజా ప్రాతినిధ్య చట్టం 61ూా లో చేర్చి చట్టబద్ధత కల్పించి 2004లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా ఈవీఎంలను అమలు చేశారని అన్నారు .2004 నుండి 2014 వరకు కేంద్రంలో కాంగ్రెస్ కూటమి ప్రభుత్వమే అధికారంలో ఉందని అప్పుడు జరగని ఈవీఎంల ట్యాంపరింగ్ 2014 నుండి మాత్రమే జరిగిందా మల్లికార్జున ఖర్గే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈవీఎంలను అనుమానించడం కాంగ్రెస్ పార్టీ స్వయంకృతాపరాధం లాంటిదేనని అన్నారు. భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటింగ్ విధానం మొదలైనప్పటి నుండి 2004 వరకు బ్యాలెట్ పద్ధతిలోనే ఎన్నికలు జరిగాయని అలాంటప్పుడు 1967 నుండి నేటి వరకు తమిళనాడులో, 1977 నుండి పశ్చిమబెంగాల్లో, 1984 నుండి సిక్కిం లో, 1989 నుండి ఉత్తరప్రదేశ్లో, 1990 నుండి బీహార్ లో, 1995 నుండి గుజరాత్లో, 2000 సంవత్సరం నుండి ఒడిశాలో కాంగ్రెస్ పార్టీ ఎందుకు గెలవలేకపోయిందో మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, నాలుగు చోట్ల ఓటర్ గా నమోదైన ప్రకాష్ రాజ్ లాంటి కుహనా మేధావులు సమాధానం చెప్పాలని అన్నారు.ప్రస్తుతం ఎన్నికల ప్రధాన కమిషనర్ గా కొనసాగుతున్న జ్ఞానేష్ కుమార్ 2024 లో జరిగిన పార్లమెంటు ఎన్నికల తర్వాత ఏడాదికి 2025లో ముఖ్య ఎన్నికల అధికారిగా నియమితులయ్యారని అలాంటప్పుడు జ్ఞానేష్ కుమార్ ఎందుకు రాజీనామా చేయాలని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ ఎదుర్కొంటున్న వరుస ఎన్నికల వైఫల్యాలను జీర్ణించుకోలేక నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ఎస్ఐఆర్ లో జరుగుతున్న ప్రక్షాళనలో ఏ ఒక్క ఓటరు తన ఓటును కోల్పోయానని దేశవ్యాప్తంగా ఎక్కడ కూడా ఒక్క కేసు కూడా నమోదు కాలేదన్న విషయం కాంగ్రెస్ నాయకులు గుర్తెరగాలని అన్నారు. అసలైన ఓటు చోరీ, నామ్ చోరీ ,కుర్చీచోరికి పాల్పడింది కాంగ్రెస్ పార్టీయేనని 1947లో నెహ్రూ తొలి ప్రధాని కాకముందు రాజ్యాంగ పరిషత్ ద్వారా మాత్రమే ఎన్నుకోబడ్డారని భారత రాజ్యాంగ పరిషత్ లోని 15 ఓట్లకు రెండు ఓట్లు గైర్హాజరు కాగా 12 ఓట్లు సర్దార్ పటేల్ కు వస్తే ఒక్క ఓటు మాత్రమే నెహ్రూ వచ్చిందని అయినా దొడ్డిదారిన ప్రధానమంత్రి అయి ఓటు చోరీకి కుర్చీ చోరీకి పాల్పడ్డారని అంతేకాకుండా నెహ్రూ కూతురు ఫిరోజ్ ఖాన్ తో వివాహమైనప్పుడు హిందూ సాంప్రదాయం ప్రకారం భర్త కులం వర్తిస్తుంది కానీ ఇందిరా ప్రియదర్శిని చివర గాంధీ పేరు తగిలించుకొని నామ్ చోరీకి పాల్పడి నేటి ప్రియాంక కొడుకు పేరిట కూడా చివర గాంధీ అని తోక తగిలించుకుని నామ్ చోరీకి పాల్పడ్డారని అన్నారు.అంతేగాకుండా 1968 రాజీవ్ గాంధీని పెళ్లాడిన సోనియా 16 సంవత్సరాల వరకు భారత పౌరసత్వం తీసుకోలేదు కానీ 1980లో జరిగిన ఎన్నికల్లో ఓటర్ లిస్టులో తన పేరు నమోదు చేసుకుని ఓటేసి ఓట్ చోరీకి సోనియా గాంధీ పాల్పడి ఓటు చోరీకి పేటెంట్ హక్కుగా నెహ్రూ కుటుంబం నిలిచిందని అన్నారు. 1971లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో రాయబరేలి నుండి రాజ్ నారాయణ పై పోటీ చేసి అక్రమ మార్గమున గెలిచిన ఇందిరాగాంధీ ఎన్నిక చెల్లదని ఆమెను ఆరేళ్లపాటు ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధించాలని అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును కాలరాసి రాత్రికి రాత్రే ఎలాంటి క్యాబినెట్ ఆమోదం లేకుండానే పార్లమెంటును రద్దుచేసి దేశంలో అత్యవసర పరిస్థితి విధించి కుర్చీ చోరీకి పాల్పడిన నీచమైన చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ చెప్పే సుద్దులు వినే పరిస్థితిలో భారత దేశ ప్రజలు లేరన్న విషయం తెలుసుకొని మసలుకోవాలని సూచించారు. 2004 నుండి దేశవ్యాప్తంగా ప్రతి శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల్లో ఈవీఎంలను మాత్రమే ఉపయోగిస్తున్నారన్న విషయం కాంగ్రెస్ నాయకులు తెలుసుకోవాలని గతంలో ఈవీఎంలు వద్దు బ్యాలెట్ పేపరే ముద్దు అనే భావనతో కొంతమంది సుప్రీంకోర్టులో కేసు వేస్తే సుప్రీంకోర్టు కేసును కొట్టి వేసిన విషయాన్ని కాంగ్రెస్ నాయకులకు తెలుసుకోవాలని అన్నారు.దేశంలో విచ్ఛిన్న రాజకీయాలకు స్వస్తి పలకాలని కాంగ్రెస్ పార్టీకి హితవు పలికారు. సమావేశంలో బిజెపి జిల్లా ప్రధాన పిల్లి శ్రీనివాస్,దళిత మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓరగంటి చంద్రశేఖర్, బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మర్రిపెల్లి సత్యమ్, మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పిండేరు భానుప్రియ, జిల్లా కార్యదర్శి పాత రమేష్, కార్యాలయ కార్యదర్శి జంబర్తి దివాకర్ దివాకర్ మీడియా కన్వీనర్ భూమి రమణ పట్టణ అధ్యక్షుడు కాశెట్టి తిరుపతి నాయకులు బద్దెల గంగరాజం తదితరులు పాల్గొన్నారు..

# ఎల్‌నినో సాకుతో రైతుల సమస్యల నుంచి తప్పించుకోలేరు

## కరెంటు కోతలు ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమే...బీఆర్ఎస్ రాష్ట్ర మీడియా ప్యానలిస్టు లక్ష్మీ నరసింహా రెడ్డి



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** ఎల్‌నినో సహజ వాతావరణ పరిణామమే అయినప్పటికీ, దాని ప్రభావంతో రైతులు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని బీఆర్ఎస్ రాష్ట్ర మీడియా ప్యానలిస్టు లక్ష్మీ నరసింహా రెడ్డి అన్నారు. రైతుల పంటలు చేతికొచ్చే సమయంలో విద్యుత్ కోతలతో ఎండిపోతుంటే, సమస్యలను పరిష్కరించాల్సింది పోయి ప్రతిపక్షాలపై విమర్శలు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని విమర్శించారు. సోమవారం ఆమనగల్ మండల కేంద్రంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా లక్ష్మీ నరసింహా రెడ్డి మాట్లాడుతూ.. ఎల్‌నినోను కాంగ్రెస్ ప్రభుత్వానికి అంటగడుతున్నారంటూ బీఆర్ఎస్‌పై విమర్శలు చేయడం మానుకుని, రైతుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై కాంగ్రెస్ నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలున్నప్పుడు రైతులను ముందస్తుగా అప్రమత్తం చేయడంతోపాటు, వారికి అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. జలాశయాల్లో నీటి నిర్వహణ, సాగునీటి సరఫరా, వ్యవసాయానికి నిరంతర విద్యుత్, ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించడం వంటి అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని కోరారు. రైతు భరోసా, పంట రుణమాఫీ, సన్న వడ్ల బోనస్ వంటి పథకాల గురించి గొప్పలు చెప్పుకోవడం కాకుండా, అర్హులైన రైతులందరికీ వాటి ప్రయోజనాలు అందాయో లేదో ప్రభుత్వం వెల్లడించాలని లక్ష్మీ నరసింహా రెడ్డి డిమాండ్ చేశారు. రైతులకు ఇచ్చిన హామీల అమలు, పంట నష్టపోయిన రైతులకు పరిహారం, సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్న రైతుల సమస్యలపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానం చెప్పాలని అన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలన గురించి మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు, అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు ఇచ్చిన హామీల అమలు పరిస్థితిని వివరించాలని ఆయన అన్నారు. గత ప్రభుత్వంపై విమర్శలు చేయడం ద్వారా ప్రస్తుత ప్రభుత్వ బాధ్యతలు తీరిపోవని స్పష్టం చేశారు. రైతుబంధు, రైతుబీమా, వ్యవసాయానికి ఉచిత విద్యుత్, సాగునీటి ప్రాజెక్టుల ద్వారా గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు అందించిన ప్రయోజనాలను ప్రజలు గుర్తుంచుకున్నారని పేర్కొన్నారు. ఎల్‌నినో వంటి ప్రకృతి పరిణామాలను రాజకీయాలకు ఉపయోగించుకుంటున్నారంటూ బీఆర్ఎస్‌పై విమర్శలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, ముందుగా రైతులు ఎదుర్కొంటున్న వాస్తవ సమస్యలపై దృష్టి సారించాలని హితవు పలికారు. ప్రకృతిని నియంత్రించడం ప్రభుత్వానికి సాధ్యం కాకపోవచ్చని, అయితే ప్రకృతి వైపరీత్యాల ప్రభావాన్ని తగ్గించేందుకు ముందస్తు ప్రణాళికలు రూపొందించడం, రైతులకు అండగా నిలవడం ప్రభుత్వ బాధ్యతని పేర్కొన్నారు. ఎల్‌నినోను బీఆర్ఎస్ సృష్టించలేదని, అయితే రైతుల కష్టాలను తగ్గించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని లక్ష్మీ నరసింహా రెడ్డి స్పష్టం చేశారు. పంటలు చేతికొచ్చే సమయంలో విద్యుత్ కోతల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల పంటలు ఎండిపోతుంటే వారిని ఆదుకోవాల్సింది పోయి, ప్రతిపక్షాలపై విమర్శలు చేయడం కాంగ్రెస్ నాయకుల విజ్ఞతకే వదిలేస్తున్నామని అన్నారు. రైతుల సంక్షేమంపై చిత్తశుద్ధి ఉంటే ఇచ్చిన హామీలను అమలు చేసి, క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు సయ్యద్ ఖలీల్, చుక్కా నిరంజన్ గౌడ్, అనూషా శ్రీశైలం, అనంతుల సైదులు గౌడ్, మాజీ మార్కెట్ డైరెక్టర్ రమేష్ నాయక్, మాజీ వార్డు సభ్యులు కోట శ్రీనివాస్, వస్పుల సాయిలు, మీసాల వర్షిత్ తదితరులు పాల్గొన్నారు.

# నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటలను ఎంచుకోవాలి



**నూతనకల్( క్రైమ్ మిర్రర్):** మండల పరిధిలోని రైతు వేదికల్లో సోమవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతుల కోసం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యక్ష ప్రసార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు,ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, ప్రభుత్వ కార్యదర్శి సంజయ్ బాజు మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావంతో సంభవించే పరిణామాలు, రాబోయే రబీ సీజన్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు దిశానిర్దేశం చేశారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో సాగు చేయగల పంటలను సాగు చేయాలని వ్యవసాయ శాస్త్రవేత్తల ద్వారా సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి,ఎంపిడివో సునీత తహసీల్దార్ శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి సైదా నాయక్, ఏఈ ప్రణయ్ కుమార్ తాళ్లసింగారం గ్రామ సర్పంచ్ జటంగి బక్కెహేమలతండా గ్రామ సర్పంచ్ గుగులోత్ కృష్ణ వ్యవసాయ విస్తరణ అధికారి లూనావత్ సాయిప్రసాద్ ఏఇఓ జానయ్య, ఏఇ ఓ సంధ్య, ఏఇ ఓ పావని గ్రామ పంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సెర్ప్ సిబ్బంది మరియు ఆయా రైతు వేదికల పరిధిలోని రైతులు పాల్గొన్నారు.

# అమ్మవారి అలంకరణలలో చరిత్రకు జీవం పోస్తూ..బతుకమ్మ

### ఈఎల్వి భాస్కర్ ఫౌండేషన్ అట్టహాసంగా బతుకమ్మ ఉత్సవాలు!



**క్రైమ్ మిర్రర్,సంస్థాన్ నారాయణపురం:-** సంస్థాన్ నారాయణపురం చారిత్రక కట్టడాల బురుజుకోటలో అమ్మవారి రూపంలో ఈ ఎల్వీ భాస్కర్ నిర్వహించిన బతుకమ్మ ఉత్సవాలలో సంస్థ నారాయణపురం గ్రామానికి చెందిన గంగాపురం సాయి ఉదయశ్రీ ఇలా బురుజుకోటలతో అమ్మవారిని అలంకరించి బతుకమ్మ తయారు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ప్రాచీన శివాలయం దగ్గర ఏర్పాటు చేసిన ప్రదర్శనలో చారిత్రక కట్టడాలను అడిగి తెలుసుకున్నారు. వీటి చరిత్ర చాలా గొప్పదని వివరించడం జరిగింది. కనుమరుగవుతున్న గురుజుకోటలను ఇలా తయారుచేసి అలంకరించడం చాలా నచ్చిందని ఈ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఈఎల్.వి భాస్కర్ అన్నారు. అనంతరం బతుకమ్మ ఆటపాటలతో కార్యక్రమాన్ని నిర్వహించారు

# పదేండ్లు బిఆర్ఎస్ అధికారంలో వికారాబాద్ జిల్లా అభివృద్ధి చెందింది

### మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్ర రెడ్డి పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి

### వికారాబాద్ జిల్లా దశాబ్ది ఉత్సవాలలో పాల్గొన్న మంత్రులు ఎమ్మెల్యేలు





**క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల:**వికారాబాద్ పట్టణంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో వికారాబాద్ జిల్లా ఏర్పాటైన సందర్భంగా దశాబ్ది ఉస్సవాలల్లో, మాజీ మంత్రి వర్యులు, మహేశ్వరం ఎమ్మెల్యే శ్రీమతి సబితా ఇంద్రరెడ్డితో సహచర ఎమ్మెల్యే కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డితో కలిసి, వికారాబాద్ జిల్లా దశబ్ది ఉస్సవాలల్లో పాల్గొన్న, పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులను రాజును చేసిన ఘనత, ప్రజలకు మేలు చేసిన వ్యక్తిగా చరిత్రలో కేసీఆర్ మిగిలిపోతే,, రేవంత్ రెడ్డి మాత్రం ప్రజలల్లో, సమాజంలో, రాక్షసుడిగా మిగిలిపోతారు అని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి విమర్శించారు. వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా కేవలం శంకుస్థాపనలకు, ఫోటోలకి మాత్రమే పరిమితం అయిన, వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ ఎమ్మెల్యేల పని తీరు ఉందని వారు తెలిపారు. 90 శాతం పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి అయితే, మూడు ఏళ్ళు గడుస్తున్న, మిగిలిన 10 శాతం పనులు కూడా పూర్తి చేయకుండా, వికారాబాద్ జిల్లా ప్రజలను, రైతులను రేవంత్ రెడ్డి మోసం చేస్తున్నారు అని మహేష్ రెడ్డి అన్నారు. పదేళ్ల టిఆర్ఎస్ పరిపాలనలో, వికారాబాద్ జిల్లాకు, నూతన కలెక్టరేట్, మెడికల్ కాలేజ్, బంజారా భవన్, రోడ్లు, ప్రభుత్వ ఆసుపత్రులు, ఇలాంటివి ఎన్నో ప్రజల అవసరాలను తీర్చే విధంగా పరిపాలించిన వ్యక్తి కేవలం కేసీఆర్ మాత్రమే అని, మహేష్ రెడ్డి గారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, నాగేందర్ గౌడ్, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# శ్రీశ్రీశ్రీ పోచమ్మ తల్లి ఆలయం పునర్నిర్మాణానికి విరాళం అందించిన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోపాల్ నాయక్

క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల: వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల కేంద్రంలో శ్రీశ్రీశ్రీ పోచమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా కుల్కచర్ల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గోపాల్ నాయక్ తన వంతు విరాళం 11116 /- ఆలయ కమిటీ సభ్యులకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బ్లాక్ బి అధ్యక్షులు, ఆలయ కమిటీ చైర్మన్ కర్రే భరత్ కుమార్,తుప్పలి అశోక్ కుమార్, ఆలయ కమిటీ కన్వీనర్ బైండ్ల బాలకృష్ణ రావు,సోషల్ మీడియా కోఆర్డినేటర్ కొమ్ము శ్రీనివాస్,నాగని ఎల్లయ్య,రాంచెంద్రయ్య,నాగని ఆంజనేయులు,వడ్డే రాములు కొనిగల్ల శ్రీను,నాగని వెంకట్రాములు, తదితరులు పాల్గొన్నారు.



# హస్లీ యాడి ఆలయ నిర్మాణానికి రాధాకృష్ణ ట్రస్ట్ రూ.25 వేల విరాళం

## మాజీ జెడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ చేతుల మీదుగా నగదు అందజేత



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (కడ్తాల్):** కడ్తాల్ మండల పరిధిలోని పెద్ద వేములోని బాయ్ తండా గ్రామపంచాయతీ పరిధిలో గల చిన్న వేముల బాయ్ తండాలో గిరిజనుల ఆరాధ్యదైవం హస్లీ యాడి అమ్మవారి ఆలయ నిర్మాణానికి రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ రూ.25 వేల ఆర్థిక సహాయం అందించింది. కడ్తాల్ మాజీ జెడ్పీటీసీ, రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జర్పుల దశరథ్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరై, ఆలయ నిర్మాణ పనుల నిమిత్తం రూ.25 వేల నగదును ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

తండా ప్రజలు ఎంతో భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అమ్మవారి ఆలయ నిర్మాణానికి ట్రస్ట్ అందించిన ఆర్థిక సహాయం పట్ల ఆలయ కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జర్పుల దశరథ్ నాయక్ మాట్లాడుతూ.. గిరిజన తండాల ఆచార వ్యవహారాలకు, తరతరాల సంస్కృతికి, ఆధ్యాత్మిక వైభవానికి హస్లీ యాడి అమ్మవారి ఆలయాలు ప్రతీకలుగా నిలుస్తాయని అన్నారు. అమ్మవారి కృపాకటాక్షాలు తండా ప్రజలందరిపై ఉండాలని, సమాజంలో శాంతి, సౌఖ్యాలు, ఐక్యత వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఇలాంటి పవిత్ర దేవాలయాల నిర్మాణాలు గిరిజనుల ఆధ్యాత్మిక సంప్రదాయాలను పరిరక్షించడంతోపాటు, ప్రజల్లో ఐక్యతా భావాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిరంతరం సేవా, ధార్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులోనూ అమ్మవారి ఆలయ నిర్మాణ పురోగతికి, గిరిజన తండాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. ఆలయ నిర్మాణ పనులను భక్తులందరూ సమష్టిగా ముందుకు తీసుకెళ్లి, నాణ్యతతో, వైభవంగా పూర్తి చేయాలని పిలుపునిచ్చారు.

**ఆలయ నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించిన దశరథ్ నాయక్‌కు కృతజ్ఞతలు...**

తమ తండాలో హస్లీ యాడి అమ్మవారి ఆలయ నిర్మాణానికి స్పందించి ఆర్థిక సహాయం అందించిన జర్పుల దశరథ్ నాయక్‌కు ఆలయ నిర్మాణ కమిటీ ప్రతినిధులు, తండా పెద్దలు, గిరిజన మహిళలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. దాతల సహకారంతో ఆలయ నిర్మాణాన్ని విజయవంతంగా పూర్తి చేసి, భవిష్యత్తు తరాలకు తమ ఆధ్యాత్మిక సంప్రదాయాలను అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వినోద్ నాయక్, దశరథ్ నాయక్, పాండు నాయక్, శీను, రమేష్, ఆలయ కమిటీ ప్రతినిధులు, తండా పెద్దలు, యువకులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి అండగా పాపిశెట్టి రాము



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (ఆమనగల్):** ఆమనగల్ మండలం చింతలపల్లి గ్రామానికి చెందిన కొప్పు మైసయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో ప్రముఖ సంఘ సేవకులు, ఆర్యవైశ్య రాష్ట్ర నాయకులు పాపిశెట్టి రామన్న తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మైసయ్య మృతి పట్ల సంతాపం తెలియజేస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని, మైసయ్య ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. కొప్పు మైసయ్య మృతి గ్రామానికి తీరని లోటని, ఆయన కుటుంబానికి ఈ బాధను తట్టుకునే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని పాపిశెట్టి రామన్న ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, నాయకులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# శంకర్‌పల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా బొల్లారం వెంకట్ రెడ్డి ప్రమాణ స్వీకారం

### చైర్మన్‌తో పాటు 12 మంది డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం





**క్రైమ్ మిర్రర్, శంకర్‌పల్లి:** శంకర్‌పల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) నూతన చైర్మన్‌గా బొల్లారం వెంకట్ రెడ్డి సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతో పాటు 12 మంది డైరెక్టర్లు కూడా ప్రమాణ స్వీకారం చేశారు.

**రైతుల సంక్షేమమే మా లక్ష్యం: వెంకట్ రెడ్డి**

ఈ సందర్భంగా నూతన చైర్మన్ బొల్లారం వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, తనకు పీఏసీఎస్ చైర్మన్‌గా అవకాశం కల్పించిన రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్యకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనకు సహకరించిన శంకర్‌పల్లి మండల కాంగ్రెస్ నాయకులకు, రైతులకు ధన్యవాదాలు తెలియజేశారు.రైతుల సంక్షేమమే లక్ష్యంగా తమ పాలకవర్గం పనిచేస్తుందని తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ, వ్యవసాయ సహకార సంఘం ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు.

**ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైన ప్రజాప్రతినిధులు**

ఈ కార్యక్రమంలో శంకర్‌పల్లి మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు, పర్వేద సర్పంచ్ సురేందర్ గౌడ్, మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్, వైస్ చైర్‌పర్సన్ శ్వేత పాండురంగారెడ్డి, ఏఎంసి వైస్ చైర్మన్ చంద్రమోహన్, డిసిసి వైస్ చైర్మన్, గోపాల్ రెడ్డి, అలంకాన్‌గూడ మాజీ సర్పంచ్ నరేందర్ రెడ్డి, మోకిల సర్పంచ్ శేఖర్, పొదటూరు సర్పంచ్ నరసింహ లక్ష్మి, గోపులారం సర్పంచ్ రవీందర్ రెడ్డి, పిల్లిగుండ్ల సర్పంచ్ కాంత్ రెడ్డి, దొంతంపల్లి సర్పంచ్ అజీమ్, పొన్నగుట్ట తండా సర్పంచ్ లక్ష్మణ్ నాయక్, సంకేపల్లి సర్పంచ్ శ్రీనివాస్, అంతప్పగూడ సర్పంచ్ బీరయ్య, కొత్తపల్లి సర్పంచ్, అక్నాపురం సర్పంచ్ బలవంత్ రెడ్డి, అలంకాన్‌గూడ సర్పంచ్ మాధవి, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.అలాగే మండలంలోని సర్పంచులు, ఉపసర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, పాలకవర్గ సభ్యులు, పీఏసీఎస్ డైరెక్టర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొని నూతన చైర్మన్ బొల్లారం వెంకట్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

# అక్రమ వెంచర్‌లో కూల్చివేతలు

## నాలుగు ఎకరాల స్థలానికి ఫెన్సింగ్.. ప్రభుత్వ భూమిగా బోర్డుల ఏర్పాటు








**గండిపేట(క్రైమ్ మిర్రర్):** ప్రభుత్వ భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని రాజేంద్రనగర్ మండల తహసీల్దార్ బొమ్మ రాములు స్పష్టం చేశారు. సోమవారం మైలార్‌దేవ్‌పల్లి పరిధిలోని ఫ్రెండ్స్ కాలనీ వెంచర్‌లో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను అధికారులు కూల్చివేసి, సదరు స్థలం ప్రభుత్వ భూమి అని పేర్కొంటూ బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ బొమ్మ రాములు మాట్లాడుతూ మైలార్‌దేవ్‌పల్లి పరిధిలోని సర్వే నంబర్లు 156, 156/1లో మొత్తం 436 ఎకరాల 27 గుంటల ప్రభుత్వ భూమి ఉందని తెలిపారు. దీనికి ఆనుకుని సర్వే నంబర్లు 156/2, 156/3లో మూడు ఎకరాల చొప్పున పట్టా భూములు ఉన్నాయని వివరించారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించే ఉద్దేశంతో కొందరు వ్యక్తులు నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ఫ్రెండ్స్ కాలనీ పేరుతో వెంచర్ ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండానే వెంచర్ ఏర్పాటు చేయడంతో ఈ వ్యవహారం కోర్టు పరిధిలోకి వెళ్లిందని తెలిపారు.

వెంచర్ ఏర్పాటు చేసిన వారు కోర్టులో సంబంధిత పత్రాలు సమర్పించకపోవడంతో, సదరు భూమి ప్రభుత్వ భూమిగా కోర్టు తీర్పు ఇచ్చినట్లు తహసీల్దార్ వెల్లడించారు. ఈ నేపథ్యంలో కోర్టు ఆదేశాల మేరకు నాలుగు ఎకరాల స్థలంలో ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో పాటు, ప్రభుత్వ భూమిగా గుర్తిస్తూ బోర్డులు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు రెవెన్యూ శాఖ నిరంతరం పర్యవేక్షణ చేపడుతుందని, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించే ప్రయత్నాలను ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు.

# ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో అవకతవకలు జరగకుండా చూడాలి

## సి పి ఎం పార్టీ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు.. జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్. కు వినతి పత్రం అందజేత



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో అవకతవకలు జరగకుండా చూడాలని, ప్రతి గ్రామంలో అర్హులకు ఇందిరమ్మ ఇళ్ళు లబ్ది చేకూరేలా పరిశీలించి న్యాయం జరుగే విధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ సిపిఐయం పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్. కు సమస్యలతో కూడిన వినతి పత్రం అందించింది.సోమవారం రోజున జిల్లా కలెక్టరేట్ లో సిపి ఐయం పార్టీకు చెందిన ఖమ్మం జిల్లా సర్పంచులు, కౌన్సిలర్లు, మరియు కార్పొరేటర్ల సమక్షంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపిక ప్రక్రియలో పారదర్శకత పాటించాలనే కోరుతూ జిల్లా సి.పి.ఐ.యం. పార్టీ కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్ కు వినతిపత్రం అందించి చర్చించారు. సమస్యల పై స్పందించిన జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్. మాట్లాడుతూ" ఇందిరమ్మ ఇండ్లు లబ్దిదారుల ప్రక్రియల పారదర్శకత పాటించుతామన్నారు. అర్హులైన అందరు లబ్దిదారులకు న్యాయం చేస్తాయన్నారు.

అనంతరం సిపి ఐయం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ అధికార పార్టీల నాయకుల పాత్ర ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపికలో సహించ బోమన్నారు. ప్రతి గ్రామంలో సర్పంచ్ కు నిర్ణయాక అధికారాలు ఎంపిక ప్రక్రియలో వుంటాయన్నారు. అర్హుల జాబితాను అంధికారులకు ముందే సమర్పించడం వలన అర్హులకు న్యాయం జరుగుతుందన్నారు. ఇండ్ల ఎంపిక ప్రక్రియలో అక్రమాలు జరిగితే ఊరుకునే ప్రశక్తే లేదన్నారు. అవసరమైతే అర్హులైన లబ్ధిదారులకు న్యాయం చేయుటకై ఎటువంటి పోరాటాలకైన సిద్ధంగా సిపి ఐయం పార్టీ ముందుంటుందని అన్నారు.

ఈ కార్యక్రమంలోఖమ్మం జిల్లా సిపిఐయం పార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేష్, ఎర్రా శ్రీనివాసరావు, మాదినేని రమేష్, పార్టీ జిల్లా కమిటి సభ్యులు శీలం సత్యనారాయణ, మదుపల్లి గోపాల్ రావు, పూరిడి సుదర్శన్ రెడ్డి, బషీర్, నందు ప్రసాద్, సర్పంచ్ లు పెద్ద భీరవెల్లి- చింతల చెరువు కోటేశ్వరరావు, యం వెంకటాయపాలెం- వేగినాటి విజయ్ కుమార్, ముదిగొండ- కట్టెకోల ఉపేందర్, కాబి రాజు గూడెం- బానోత్ హరి, పిండిప్రోలు- సువార్త, ఐదుర్ల చెరువు- ఆ రెండుల వినోద, అరికోడు- ఆరింపుల రమాదేవి, ఎడవల్లి లక్ష్మీపురం- స్వాతి, అష్ట గుర్తి- కె. అనిత, చిరుమర్రి-రాంబాబు, ఎల్ గోవిందాపురం- కరుణ, నాగుల వంచ రైల్వే కాలనీ-నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# వట్టేపల్లి రైల్వే బ్రిడ్జి కింద గంజాయి పట్టివేత.. ఇద్దరు అరెస్ట్

### 1.268 కిలోల ఎండు గంజాయి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 1.268 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ వివరాల ప్రకారం.. సోమవారం ఉదయం 9.30 గంటల సమయంలో వట్టేపల్లిలోని రైల్వే బ్రిడ్జి కింద గంజాయి విక్రయాలు జరుగుతున్నాయన్న విశ్వసనీయ సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. పోలీసులను గమనించిన ఇద్దరు వ్యక్తులు పారిపోయేందుకు ప్రయత్నించగా వారిని అదుపులోకి తీసుకున్నారు. వారిని ఫలక్‌నుమా ఫాతిమా నగర్‌కు చెందిన షేక్ ఇర్ఫాన్ (30), వట్టేపల్లి నూర్ కాలనీకి చెందిన షేక్ ఇమ్రాన్ (30)గా గుర్తించారు. పంచ సాక్షులు, క్లూస్ టీమ్ సమక్షంలో తనిఖీలు నిర్వహించగా వారి వద్ద ఒక బండిల్‌తో పాటు 8 నుంచి 10 గ్రాముల బరువున్న పది చిన్న ప్యాకెట్లలో ఉంచిన ఎండు గంజాయి లభ్యమైంది. మొత్తం 1.268 కిలోల గంజాయితో పాటు ఒక రెడ్‌మీ, ఒక రియల్‌మీ ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్, గంజాయి ప్యాకింగ్‌కు ఉపయోగించే సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి చట్టపరమైన చర్యలు చేపట్టారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా గంజాయి సరఫరా చేస్తున్న ఒక వ్యక్తిని కూడా పోలీసులు గుర్తించారు. గంజాయి ఎక్కడి నుంచి తీసుకొస్తున్నారు? అక్రమ సరఫరా వెనుక ఇంకా ఎవరెవరు ఉన్నారనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోందని మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ చి. శ్రీనివాస్ తెలిపారు.



# ప్రజల కన్నీళ్లు తుడిచే అవకాశం పోలీసులకే ఉంది: డీజీపీ సీవీ ఆనంద్

**తెలంగాణ పోలీస్ అకాడమీలో 112 మంది డీఎస్పీల పాసింగ్ అవుట్ పరేడ్**

**పోలీసు యూనిఫాం ధరించడం గొప్ప అదృష్టం**

**నాయకత్వం, నైతిక విలువలు, సాంకేతిక పరిజ్ఞానంపై డీజీపీ దిశానిర్దేశం**

**నేరాల తీరు మారింది.. పోలీసింగ్ మారాలి**

**ప్రజలకు నిజాయతీగా, రాగద్వేషాలకు అతీతంగా సేవలందించాలి**

**పాసింగ్ అవుట్ పరేడ్ లో చేసిన ప్రమాణాన్ని ఎప్పుడూ గుర్తుంచుకోవాలి**

**విధులు ఫిట్‌నెస్, స్మార్ట్‌నెస్ తప్పనిసరి: డీజీపీ సీవీ ఆనంద్**





**గండిపేట(క్రైమ్ మిర్రర్):** పోలీసు యూనిఫాం ధరించడం గొప్ప అదృష్టమని, ప్రజలకు సేవ చేయడంతోపాటు వారి ప్రాణాలను కాపాడే అరుదైన అవకాశం పోలీసు శాఖలో పనిచేసేవారికి లభిస్తుందని డీజీపీ సీవీ ఆనంద్ అన్నారు. తెలంగాణలో నాలుగు కోట్ల జనాభాలో సుమారు 90 వేల మందికే పోలీసు యూనిఫాం ధరించే అవకాశం ఉందని, ఇది మొత్తం జనాభాలో 0.3 శాతం మాత్రమేనని వివరించారు. ప్రతిరోజూ కనీసం 50 మంది కన్నీళ్లు తుడిచే అవకాశం పోలీసులకు ఉంటుందని పేర్కొన్నారు. నిజాయితీ, నైతిక విలువలను విస్మరించరాదని, కుల, మత, రాజకీయ రాగద్వేషాలకు అతీతంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. తెలంగాణ పోలీసు అకాడమీలో శిక్షణ పూర్తి చేసుకున్న 112 మంది డీఎస్పీల పాసింగ్ అవుట్ పరేడ్ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2014 తర్వాత పూర్తిస్థాయిలో శిక్షణ ముగించుకుని బయటకు వస్తున్న తొలి డీఎస్పీ బ్యాచ్ కావడంతో దీనికి ప్రత్యేకత ఉందన్నారు. 44 వారాలపాటు చట్టాలు, దర్యాప్తు విధానాలు, ఔట్‌డోర్ శిక్షణ, క్రీడల్లో శిక్షణ పొందిన అధికారులను అభినందించారు. శిక్షణలో ప్రతిభ కనబరిచిన వారిని ప్రశంసిస్తూ, అకాడమీ అధికారులు, అధ్యాపకులు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. కొన్ని కారణాల వల్ల ముఖ్యమంత్రి పాసింగ్ అవుట్ పరేడ్‌కు హాజరు కాలేకపోతున్నట్లు తెలిపారని పేర్కొన్నారు.

**30 ఏళ్ల వృత్తి జీవితానికి పునాది...**

పాసింగ్ అవుట్ పరేడ్ సందర్భంగా చేసే ప్రమాణం అధికారుల 30--35 ఏళ్ల వృత్తి జీవితానికి మార్గదర్శకంగా నిలవాలని డీజీపీ సూచించారు. రాజ్యాంగం పట్ల నిబద్ధతతో, ప్రజలకు నిజాయతీగా, రాగద్వేషాలకు అతీతంగా విధులు నిర్వహిస్తానని చేసిన ప్రమాణాన్ని ఎప్పుడూ గుర్తుంచుకోవాలన్నారు. అకాడమీలో శిక్షణ పూర్తయిన తర్వాత మరో 46 వారాలపాటు క్షేత్రస్థాయిలో శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈ దశలోనూ అదే శ్రద్ధ, క్రమశిక్షణ, నిజాయతీతో వ్యవహరించాలని సూచించారు. తన 35 ఏళ్ల పోలీసు అనుభవంలో నేర్చుకున్న అంశాలను గతంలో డీఎస్పీలతో నిర్వహించిన ముఖాముఖిలో వివరించానని, నాయకత్వ లక్షణాల ప్రాధాన్యాన్ని మరోసారి గుర్తుచేస్తున్నానని చెప్పారు.

**నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి: డీజీపీ**

ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. మీరు నాయకులుగా ఎంపికయ్యారు.. మీ నాయకత్వ లక్షణాలను విధుల్లో నిరూపించుకోవాలని అన్నారు. ధైర్యం, దార్శనికత, నైతిక విలువలు, నిష్పాక్షికత, బృంద స్ఫూర్తి, సంభాషణ నైపుణ్యాలు, కష్టపడే తత్వం, సాంకేతిక పరిజ్ఞానం, నూతన ఆలోచనలు, వినయం.. ఈ పది లక్షణాలను ప్రతి అధికారి అలవర్చుకోవాలని సూచించారు. విధుల నిర్వహణలో నైతిక విలువలను ఎట్టి పరిస్థితుల్లోనూ విస్మరించరాదన్నారు.

**నేరాల తీరు మారింది.. పోలీసింగ్ మారాలి..**

తాము యూనిఫాం ధరించిన రోజుల్లో నక్సలిజం ప్రధాన సవాలుగా ఉండేదని, ఆ సమస్యను పోలీసులు సమర్థంగా ఎదుర్కొన్నారని డీజీపీ గుర్తుచేశారు. ప్రస్తుతం సైబర్ నేరాలు, వ్యవస్థీకృత నేరాలు, రోడ్డు భద్రత, ఇతర కొత్త తరహా సవాళ్లు పోలీసుల ముందున్నాయని తెలిపారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పోలీసు శాఖలో సంస్థాగత మార్పులు చేపట్టామని చెప్పారు. గ్రేహౌండ్స్ తదితర విభాగాల పునర్వ్యవస్థీకరణతోపాటు ఈగల్ ఫోర్స్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో, టీజీ ఫాస్ట్, టీజీ స్పార్క్ వంటి విభాగాలను బలోపేతం చేసి కొత్త సవాళ్లను ఎదుర్కొనేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. క్షేత్రస్థాయిలో పనిచేసే అధికారులు కూడా ఈ మార్పులకు అనుగుణంగా సిద్ధంగా ఉండాలని సూచించారు.

**ఫిట్‌నెస్, స్మార్ట్‌నెస్ తప్పనిసరి...**

పోలీసు శాఖలో శారీరక దారుఢ్యం, చురుకుదనం, వృత్తిపరమైన నైపుణ్యాలు అత్యంత ముఖ్యమని డీజీపీ అన్నారు. యూనిఫాం ధరించిన తొలిరోజు ఉన్న ఉత్సాహం, క్రమశిక్షణ, ఫిట్‌నెస్ 30 ఏళ్ల తర్వాత కూడా కొనసాగాలని ఆకాంక్షించారు. పోలీసు పాసింగ్ అవుట్ పరేడ్‌లో బెల్టుపై ఉన్న హోల్ (రంధ్రం) 30 ఏళ్ల సర్వీసు పూర్తయ్యే వరకు, ఉద్యోగ విరమణ చేసేంతవరకు అలాగే ఉండాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలందిస్తూ, సమర్థవంతమైన నాయకులుగా ఎదగాలని డీఎస్పీలకు పిలుపునిచ్చారు.

**12 సంఖ్యకు ప్రత్యేక అనుబంధం- అకాడమీ డైరెక్టర్**

తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్ మాట్లాడుతూ.. 112 సంఖ్యకు ప్రత్యేక ప్రాధాన్యం ఉందన్నారు. ప్రజల అత్యవసర సేవల కోసం తెలంగాణ పోలీసు వ్యవస్థలో 112 సేవలు అందుబాటులో ఉన్నాయని, ఇప్పుడు 112 మంది డీఎస్పీలు ప్రజా సేవలోకి అడుగుపెట్టడం విశేషమని పేర్కొన్నారు. వీరిలో 74 మంది పురుషులు, 38 మంది మహిళలు ఉన్నారు. మల్టీజోన్-1 నుంచి 51 మంది, మల్టీజోన్-2 నుంచి 61 మంది ఎంపికయ్యారు. విద్యార్హతల పరంగా 79 మంది డిగ్రీ పట్టభద్రులు, 31 మంది పీజీ పూర్తి చేసినవారు ఉన్నారు. మరో ఇద్దరిలో ఒకరు ఎంబీబీఎస్, మరొకరు బీడీఎస్ పట్టా పొందారు. ఈ బ్యాచ్‌లో గతంలో రాష్ట్ర ప్రభుత్వంలో పనిచేసినవారు 45 మంది, కేంద్ర ప్రభుత్వంలో పనిచేసినవారు 12 మంది ఉండగా.. కొత్తగా ఉద్యోగ జీవితంలోకి అడుగుపెడుతున్నవారు 55 మంది ఉన్నారు. గతంలో పోలీసు శాఖలో ఎస్సైలుగా పనిచేసిన నలుగురు ప్రస్తుతం డీఎస్పీలుగా ఎంపికయ్యారు. శిక్షణ పొందుతూనే 2026లో యూపీఎస్సీ పరీక్షల్లో జి.సృజన 55వ ర్యాంకు, డి.ప్రవీణ్‌కుమార్ 795వ ర్యాంకు సాధించడం విశేషం. ఆరు వారాల ఫౌండేషన్ శిక్షణను డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో అందించినట్లు చెప్పారు. అకాడమీ నినాదమైన నాలెడ్జ్, స్కిల్, ఆటిట్యూడ్ ఆధారంగా అధికారులకు శిక్షణ ఇచ్చామని తెలిపారు. క్షేత్రస్థాయి అనుభవం కల్పించేందుకు మేడారం జాతర, వినాయక చవితి, ఇతర ప్రధాన కార్యక్రమాల్లో విధులు నిర్వహించే అవకాశం కల్పించామన్నారు. సైబర్ సెక్యూరిటీ బ్యూరో, ఈగల్ వంటి విభాగాలతో శిక్షణ ఇచ్చినట్లు వివరించారు. పోలీసుల విధి ప్రజలకు న్యాయం చేయడమేనని, వారి పనితీరును బట్టే ప్రజలు వారిని అంచనా వేస్తారని అన్నారు.

**నేహా అగర్వాల్‌కు సీఎం రివాల్వర్.....9 విభాగాల్లో ఉత్తమ ప్రతిభకు ట్రోఫీలు, పతకాలు**

పోలీస్ శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన నేహా అగర్వాల్ ముఖ్యమంత్రి రివాల్వర్‌తో పాటు మరో మూడు పురస్కారాలను అందుకున్నారు. బెస్ట్ ఆల్‌రౌండ్ పెర్ఫార్మెన్స్‌కు సీఎం రివాల్వర్, రాజా బహదూర్ వెంకట రామారెడ్డి బంగారు పతకం, కోన రామచంద్రారెడ్డి స్మారక బంగారు పతకం, ఇండోర్ సబ్జెక్టుల్లో ప్రతిభకు హోంమంత్రి బేటన్ ఆమెకు లభించాయి. రాజా బహదూర్ వెంకట రామారెడ్డి బంగారు పతకంతో పాటు రూ.5,000 నగదు బహుమతి కూడా అందుకున్నారు. ఇతర విభాగాల్లో ప్రతిభ కనబరిచిన వారిలో ఔట్‌డోర్ సబ్జెక్టుల్లో ఎల్. శ్రీకాంత్ డీజీపీ ట్రోఫీ, ఫైరింగ్‌లో టి. జాకబ్ అభిషేక్ ఉత్తమ పురస్కారం అందుకున్నారు. ఫోరెన్సిక్ సైన్స్‌లో డి. చందన, క్రిమినాలజీలో చి. ఆది శేషు రెడ్డి ఎన్ఐసీఎఫ్ఎస్ పతకాలు సాధించారు. దర్యాప్తులో ఉత్తమ ప్రతిభకు ఆర్. సాయి కిరణ్ రెడ్డి డైరెక్టర్ పతకాన్ని దక్కించుకున్నారు.

**చట్టాల నుంచి సైబర్ నేరాల దర్యాప్తు వరకు...**

44 వారాల సంస్థాగత శిక్షణలో భాగంగా ఇండోర్, అవుట్‌డోర్ అంశాలను రెండు సెమిస్టర్లుగా విభజించారు. ఇండోర్ శిక్షణలో పోలీసు వ్యవస్థ, నేరశాస్త్రం, నేరాల నివారణ, మానవ హక్కులు, భారతీయ న్యాయ సంహిత, భారతీయ సాక్ష్య అధినియం, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, ఫోరెన్సిక్ సైన్స్, నాయకత్వం, నిర్వహణ వంటి అంశాలను బోధిస్తున్నారు. శారీరక నేరాలు, ఆస్తి సంబంధ నేరాలు, సైబర్ నేరాలు, ఆర్థిక మోసాల దర్యాప్తు విధానాలపైనా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. అంతర్గత భద్రత, శాంతిభద్రతల నిర్వహణపై అవగాహన కల్పిస్తున్నారు.

**ఆయుధ వినియోగం.. క్షేత్రస్థాయి నైపుణ్యాలు**

అవుట్‌డోర్ శిక్షణలో శారీరక వ్యాయామాలు, డ్రిల్, పరేడ్, ఆయుధ వినియోగం, కాల్పులు, ఫీల్డ్‌క్రాఫ్ట్, మ్యాప్ రీడింగ్, వ్యూహాత్మక విధానాలు, వీఐపీ భద్రత, పేలుడు పదార్థాలు, ఐఈడీల నిర్వహణ వంటి అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. స్విమ్మింగ్, ప్రథమ చికిత్స, అంబులెన్స్ డ్రిల్, వాహనాల డ్రైవింగ్, విపత్తుల నిర్వహణ, అగ్నిమాపక చర్యలు, క్రీడలకూ ప్రాధాన్యం ఇచ్చారు. పాసింగ్ అవుట్ పరేడ్‌లో సీనియర్ పోలీసు అధికారులు, రిటైర్డ్ పోలీసు అధికారులు, అకాడమీ సిబ్బంది, శిక్షణ పొందిన డీఎస్పీల కుటుంబ సభ్యులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.



## రైతులకు కనీసం 12 గంటల విద్యుత్ అందించాలి

**ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి**

నర్సాపూర్, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 12: రైతులకు కనీసం 12 గంటల పాటు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందించాలని డిమాండ్ చేస్తూ శివ్వంపేట మండలం చండి సబ్‌స్టేషన్ వద్ద, కౌడిపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమాల్లో నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వ్యవసాయానికి సరిపడా విద్యుత్ సరఫరా లేకపోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ కోతల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి వ్యవసాయానికి రోజుకు కనీసం 12 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి, పంటలు ఎండిపోకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి కోరారు.

## బతుకమ్మ వేడుకలకు పత్తికుంట చెరువులో ఏర్పాట్లు చేయాలి




**గండిపేట(క్రైమ్ మిర్రర్):** ఈ నెల 18వ తేదీన ఆదివారం దుర్గాష్టమి సందర్భంగా నిర్వహించనున్న బతుకమ్మ పండుగకు రాజేంద్రనగర్‌లోని పత్తికుంట చెరువు వద్ద అవసరమైన ఏర్పాట్లు చేయాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. పత్తికుంట చెరువులో నీటిని నింపడంతో పాటు, బతుకమ్మ ఆడేందుకు మహిళలకు ఇబ్బందులు కలగకుండా తగిన లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. బతుకమ్మ నిమజ్జనానికి కూడా అవసరమైన సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా దేవీ నవరాత్రుల సందర్భంగా బస్తీల్లోని వివిధ మండపాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాల నిమజ్జనానికి ఇబ్బందులు తలెత్తకుండా క్రేన్ ఏర్పాటు చేయాలని జోనల్ కమిషనర్‌ను కోరారు. పండుగల సందర్భంగా భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేలా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ--గోషామహల్ జిల్లా ఇన్‌చార్జి వై. శ్రీధర్, జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు ఎం. కొమురయ్య, జిల్లా బీజేపీ సీనియర్ నాయకుడు ఎస్. జయానంద్‌రెడ్డి, అత్తాపూర్ బీజేపీ అధ్యక్షుడు సులిగే వెంకటేష్, ఈ. వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీలో వైభవంగా వీరలక్ష్మి అమ్మవారి అభిషేకం, సుదర్శనేష్టి

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** ముచ్చింతల్‌లోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రమైన స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ పవిత్ర సందర్భాన్ని పురస్కరించుకుని సోమవారం శరన్నవరాత్రి మహోత్సవాలలో రెండొవ రోజు శ్రీ వీరలక్ష్మి అమ్మవారికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం 9 గంటలకు అమ్మవారికి నేత్రపర్వంగా విశేష అభిషేక మహోత్సవం జరిపించారు. అలాగే సాయంత్రం 5:30 గంటలకు విష్ణుసహస్రనామ స్తోత్ర పారాయణం, వీరలక్ష్మి అమ్మవారి పల్లకిసేవ, అర్చన, నివేదన, మంగళాశాసనం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు కన్నులపండువగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు..



## వ్యాపారులకు నో బిన్--నో ట్రేడ్‌పై అవగాహన

**తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలి.. నార్సింగి సర్కిల్ అధికారుల సూచన**




**గండిపేట(క్రైమ్ మిర్రర్):** పరిసరాల పరిశుభ్రతను కాపాడటంతో పాటు చెత్త నిర్వహణను మెరుగుపరిచే లక్ష్యంతో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నార్సింగి సర్కిల్ ఆధ్వర్యంలో 126వ వార్డులోని గౌలిదొడ్డి, వట్టినాగులపల్లి గ్రామాల్లో సోమవారం 'నో బిన్--నో ట్రేడ్' కార్యక్రమంపై అవగాహన కల్పించారు. గౌలిదొడ్డిలో ఉదయం 11:30 గంటలకు, వట్టినాగులపల్లిలో మధ్యాహ్నం 12:30 గంటలకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక వ్యాపారులకు చెత్త నిర్వహణపై అధికారులు సూచనలు చేశారు. ప్రతి వ్యాపార సంస్థలో తడి చెత్త, పొడి చెత్త కోసం ప్రత్యేకంగా రెండు చెత్త బుట్టలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. తడి చెత్త, పొడి చెత్తతో పాటు హానికర వ్యర్థాలను కూడా వేర్వేరుగా నిర్వహించాలని సూచించారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా, మూలస్థాయిలోనే వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలని వివరించారు. వ్యాపారులు పరిశుభ్రత నియమాలను పాటించడం ద్వారా పరిసరాలను శుభ్రంగా ఉంచవచ్చని, ప్రజారోగ్య పరిరక్షణకు సహకరించవచ్చని అధికారులు పేర్కొన్నారు. నగర పరిశుభ్రతలో వ్యాపారులు భాగస్వాములు కావాలని నార్సింగి సర్కిల్ అధికారులు సూచించారు.

## వైఎస్సార్ కాలనీలో వన్ డే--వన్ వార్డు కార్యక్రమం

**కాలనీలో పర్యటించి స్థానిక సమస్యలపై ప్రతినిధులతో చర్చించిన అధికారులు**



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** నార్సింగి సర్కిల్ పరిధిలోని నెక్నాంపూర్ డివిజన్ వైఎస్సార్ కాలనీలో 'వన్ డే--వన్ వార్డు' కార్యక్రమాన్ని నిర్వహించారు. సైబరాబాద్ కమిషనర్ ఆదేశాల మేరకు డిప్యూటీ కమిషనర్ జి. లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో అధికారులు కాలనీలో పర్యటించి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీ ప్రతినిధులతో సమావేశమై ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు. కాలనీలో నెలకొన్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను తెలుసుకుని, సంబంధిత అంశాలపై చర్యలు చేపట్టడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా కాలనీలోని సమస్యలకు పరిష్కారం లభిస్తుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

## కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు బీజేపీ అండగా ఉంటుంది: తోకల శ్రీనివాస్‌రెడ్డి



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** వైద్య ఆరోగ్యశాఖలో నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) విభాగంలో గత 20 ఏళ్లకు పైగా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులను ప్రభుత్వం వెంటనే క్రమబద్ధీకరించి న్యాయం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన కార్యాలయంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 17 వేల మంది ఉద్యోగులు 78 రకాల క్యాడర్లలో వైద్య ఆరోగ్యశాఖకు సేవలందిస్తున్నారని తెలిపారు. గర్భిణులకు వైద్య సేవలు అందించడం నుంచి చిన్నారులకు టీకాలు వేయడం, వృద్ధులకు ఆరోగ్య సేవలు అందించడం వరకు కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని పేర్కొన్నారు. కరోనా మహమ్మారి సమయంలోనూ, ఇతర అత్యవసర పరిస్థితుల్లోనూ వైద్య సిబ్బంది ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవలందించారని గుర్తుచేశారు.

కేంద్ర ప్రభుత్వం ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల వేతనాలకు 60 శాతం నిధులు అందిస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా 40 శాతం నిధులు అందించాల్సి ఉందన్నారు. అయినప్పటికీ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కావడం లేదని విమర్శించారు. 15 ఏళ్లకు పైగా పనిచేస్తున్నా అదే వేతనాలతో కొనసాగుతున్నారని, ప్రతి ఏడాది ఇవ్వాల్సిన ఐదు శాతం ఇంక్రిమెంట్ కూడా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర రాష్ట్రాల్లో ఉద్యోగుల క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకుంటుండగా, తెలంగాణలో మాత్రం తమకు న్యాయం జరగడం లేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని హామీ ఇచ్చిందని, ప్రభుత్వం ఏర్పడి దాదాపు మూడేళ్లు కావస్తున్నా ఆ హామీ అమలుకు నోచుకోలేదని విమర్శించారు. ప్రజలకు క్షేత్రస్థాయిలో వైద్య సేవలందిస్తున్న ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఉద్యోగులకు న్యాయం జరిగే వరకు బీజేపీ వారి పక్షాన నిలుస్తుందని భరోసా ఇచ్చారు. మంగళవారం ఇందిరా పార్క్ వద్ద ఉద్యోగులు చేపట్టనున్న ధర్నా కార్యక్రమానికి బీజేపీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని తెలిపారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లకు ప్రజలు కూడా మద్దతుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం జేఏసీ ప్రతినిధులు, జిల్లా వైద్య అధికారులు డాక్టర్ దినేష్, ఆదిత్య, చేతన్, నేతర్, సాయిబాబా, బాలకృష్ణ, సంగీత, అనూప్ తదితరులు పాల్గొన్నారు.

# హత్య కేసు నిందితుడి అరెస్ట్

**కోర్టు వాయిదాలకు హాజరుకాకుండా తప్పించుకొని తిరుగుతున్న నిందితుడు**

**నాయనమ్మ హత్య కేసులో నాన్ బెయిలబుల్ వారెంట్**

**నిందితుడికి 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్**

**కోర్టు ఆదేశాలను గౌరవిస్తూ చట్టపరమైన ప్రక్రియకు సహకరించాలి**

**హుజూర్నగర్ సీఐ చరమందరాజు**



**క్రైమ్ మిర్రర్,హుజూర్ నగర్:** కోర్టు వాయిదాలకు హాజరుకాకుండా తప్పించుకొని తిరుగుతున్న నిందితుడిని అరెస్ట్ చేసి పోలీసులు కోర్టులో హాజరుపరిచారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నేరేడుచర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన క్రైమ్ నంబర్ 253/2023 లో నాయనమ్మను హత్య చేసిన కేసులో నిందితుడిగా ఉన్న షేక్ సలీం పాషా (42), నేరేడుచర్ల పట్టణం, రిమాండ్ ముగిసిన అనంతరం బెయిల్‌పై విడుదలయ్యాడు. అయితే, బెయిల్‌పై విడుదలైన తర్వాత నిందితుడు కోర్టు వాయిదాలకు హాజరుకాకుండా తప్పించుకొని తిరుగుతున్న నేపథ్యంలో హుజూర్‌నగర్ కోర్టు అతనిపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది అని హుజూర్నగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ చరమందరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్రమంలో అతని కదలికలపై నిఘా ఉంచి నేరేడుచర్ల పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకొని, సోమవారం న్యాయస్థానంలో హాజరుపరిచారు. విచారణ అనంతరం గౌరవ న్యాయమూర్తి నిందితుడికి 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో నిందితుడిని హుజూర్‌నగర్ సబ్‌జైలుకు తరలించారు. కోర్టు వాయిదాలకు హాజరుకావడం ప్రతి నిందితుడి బాధ్యత. కోర్టు నోటీసులు, వారెంట్లు, వాయిదాలను నిర్లక్ష్యం చేస్తూ చట్ట ప్రక్రియ నుంచి తప్పించుకోవాలని ప్రయత్నించే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హుజూర్‌నగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చరమందరాజు తెలిపారు. చట్టం నుంచి ఎవరూ తప్పించుకోలేరు. కోర్టు ఆదేశాలను గౌరవిస్తూ చట్టపరమైన ప్రక్రియకు సహకరించాలి అన్నారు.

## ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఢిల్లీలో నిర్వహించిన కాంగ్రెస్ ర్యాలీలో పాల్గొన్న నెక్నాంపూర్, మణికొండ కాంగ్రెస్ నాయకులు




**గండిపేట(క్రైమ్ మిర్రర్):** కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ పిలుపు మేరకు ఢిల్లీలో నిర్వహించిన భారీ ర్యాలీలో నెక్నాంపూర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు జితేందర్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కిరణ్ కుమార్, మాజీ మైనారిటీ అధ్యక్షుడు షేక్ హాజీ పాల్గొన్నారు. ఈ ర్యాలీలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్, పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు, డీసీసీ అధ్యక్షురాలు పరిజాత నర్సింహారెడ్డి , ఇతర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జితేందర్ మాట్లాడుతూ దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రజలను కలుసుకోవడం, వారి అభిప్రాయాలను తెలుసుకోవడం ఎంతో విలువైన అనుభవమని పేర్కొన్నారు. ప్రజల భావప్రకటన స్వేచ్ఛ, ప్రజాస్వామ్య హక్కులు, భిన్నాభిప్రాయాలకు గౌరవం వంటి అంశాలపై దేశవ్యాప్తంగా ప్రజల్లో ఉన్న ఆందోళనలను ఈ సమావేశం ద్వారా తెలుసుకునే అవకాశం లభించిందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల గొంతుకకు ప్రాధాన్యత ఉండాలని, ప్రభుత్వ విధానాలను ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడికి ఉందని ఆయన స్పష్టం చేశారు. ప్రజల అభిప్రాయాలను అణచివేయడం కాకుండా వాటిని గౌరవించడం ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రాథమిక లక్షణమని పేర్కొన్నారు. దేశ రాజ్యాంగ విలువలను, ప్రజాస్వామ్య వ్యవస్థను, పౌరుల హక్కులను పరిరక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ నిబద్ధతతో పనిచేస్తుందని జితేందర్ తెలిపారు. ప్రజల గొంతుకే ప్రజాస్వామ్యానికి బలం. ప్రజల హక్కుల పరిరక్షణ కోసం మా పోరాటం నిరంతరం కొనసాగుతుంది అని ఆయన పేర్కొన్నారు.

## కిషన్‌గూడ ఫ్లైఓవర్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతి



గండిపేట(క్రైమ్ మిర్రర్): శంషాబాద్ పరిధిలోని కిషన్‌గూడ ఫ్లైఓవర్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కలకలం రేపింది. సుమారు 50 నుంచి 55 ఏళ్ల వయసున్న వ్యక్తి మృతి చెంది ఉండటాన్ని గుర్తించిన పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రాథమిక విచారణలో మృతుడు గత కొన్ని నెలలుగా శంషాబాద్ పరిసర ప్రాంతాల్లో భిక్షాటన చేస్తూ జీవిస్తున్నట్లు సమాచారం తెలిసిందని పోలీసులు పేర్కొన్నారు. అయితే, అతడి మృతికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. మృతుడి వివరాలను గుర్తించడంతో పాటు, మరణానికి దారితీసిన పరిస్థితులపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం నివేదిక, తదుపరి విచారణలో వెల్లడయ్యే వివరాల ఆధారంగా మృతికి గల కారణాలు తెలిసే అవకాశం ఉంది.

# ఖమ్మంలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి శ్రీకారం

**వేద మంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా భూమిపూజ.. శ్రీవారి ఆలయ నిర్మాణానికి శుభారంభం**

**శ్రీ శ్రీ శ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి, టీటీడీ చైర్మన్ శ్రీ బీఆర్ నాయుడు, మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా పవిత్ర క్రతువు**

ప్రహరీ గోడ నిర్మాణానికి రూ. 3.40 కోట్లు మంజూరు



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో :** కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరస్వామివారు ఖమ్మంలో కొలువుదీరేందుకు తొలి అడుగు పడింది. తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లాలో శ్రీవారి దివ్యాలయ నిర్మాణానికి టీటీడీ సోమవారం శ్రీకారం చుట్టింది. వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామివారు శాస్త్రోక్తంగా భూమిపూజ నిర్వహించారు. ఈ పవిత్ర కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ శ్రీ బీఆర్ నాయుడు, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

**వేదమంత్రాల సాక్షిగా ఆధ్యాత్మిక శుభారంభం**

ఆగమ శాస్త్ర సంప్రదాయాలకు అనుగుణంగా ముందుగా హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు భూమిపూజ ప్రదేశాన్ని సంప్రోక్షణ చేసిన అనంతరం వేద మంత్రోచ్చారణల మధ్య భూమిపూజ నిర్వహించారు. ఈ పవిత్ర ఘట్టం అనంతరం శ్రీ శ్రీ శ్రీ చిన్నజీయర్ స్వామివారితో కలిసి టీటీడీ చైర్మన్ శ్రీ బీఆర్ నాయుడు శ్రీవారి ఆలయ నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఖమ్మం ప్రాంత భక్తులకు శ్రీవారి దివ్యదర్శన భాగ్యాన్ని చేరువ చేయడంతో పాటు, సనాతన ధర్మ ప్రచారాన్ని విస్తృతం చేయాలనే లక్ష్యంతో ఈ ఆలయాన్ని నిర్మించనున్నారు.

**20.04 సెంట్ల భూమి కేటాయింపు -- ప్రహరీకి రూ.3.40 కోట్లు**

ఖమ్మం అర్బన్ మండలం, ధ్వంసలాపురం రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నంబరు 408/2లో తెలంగాణ ప్రభుత్వం ఆలయ నిర్మాణం కోసం 20.04 సెంట్ల భూమిని అల్లిపురం గ్రామంలో కేటాయించింది. ఈ భూమికి రక్షణగా ప్రహరీ గోడ నిర్మాణం కోసం టీటీడీ రూ. 3.40 కోట్లు మంజూరు చేసింది. అవసరమైన నిధులతో ప్రధాన ఆలయ నిర్మాణ పనులను టిటిడి చేపట్టనుంది.

**ప్రధాన ఆలయంతో పాటు ఉపాలయాలు, రాజగోపురం నిర్మాణం**

ఖమ్మంలో నిర్మించనున్న ఈ దివ్యక్షేత్రంలో శ్రీ వేంకటేశ్వరస్వామివారి ప్రధాన ఆలయంతో పాటు ఉపాలయాలు, రాజగోపురం, పోటు (వంటశాల), ప్రాకారం తదితర నిర్మాణాలు చేపట్టనున్నారు. ఆలయ నిర్మాణం పూర్తయితే ఖమ్మం ప్రాంత భక్తులకు శ్రీవారి దర్శనం మరింత చేరువ కావడంతో పాటు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ధార్మిక ప్రచారానికి ఈ క్షేత్రం ప్రధాన కేంద్రంగా నిలవనుంది.

**రెండు తెలుగు రాష్ట్రాలను అనుసంధానించే ఆధ్యాత్మిక కేంద్రం: శ్రీ శ్రీ శ్రీ చిన్నజీయర్ స్వామి**

శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామివారు ఖమ్మం ప్రజలకు మంగళాశాసనాలు అందిస్తూ, ఖమ్మం నగరం రెండు తెలుగు రాష్ట్రాలను ఆధ్యాత్మికంగా అనుసంధానించే కేంద్రంగా ఎదగాలని ఆకాంక్షించారు. శ్రీనివాసుడి కుటుంబ సభ్యులుగా భావించి ప్రతి ఒక్కరూ ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రజలకు అరిష్టాలు తొలగి, పాడిపంటలతో పల్లెలు సుభిక్షంగా వర్ధిల్లాలని ఆశీర్వదించారు. భక్తుల సహకారంతో ఆలయ నిర్మాణం పూర్తయి, ఖమ్మం ఆధ్యాత్మిక వైభవానికి చిరునామాగా నిలవాలని ఆకాంక్షించారు.

**దేశవ్యాప్తంగా శ్రీవారి ఆలయాల నిర్మాణానికి టీటీడీ కృషి: చైర్మన్ శ్రీ బీఆర్ నాయుడు**

టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా శ్రీవారి ఆలయాలను నిర్మించాలనే సంకల్పంతో టీటీడీ ముందుకు సాగుతోందని తెలిపారు. హిందూ ధర్మం, సనాతన సంప్రదాయాల పరిరక్షణకు ఆలయాలు దోహదపడతాయన్నారు. ఆలయ నిర్మాణంలో భక్తుల భాగస్వామ్యం, విరాళాల ప్రాధాన్యాన్ని వివరించారు.

**సనాతన ధర్మ పరిరక్షణకు ఆలయాలు కీలకం: మంత్రి శ్రీ తుమ్మల**

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, ఖమ్మంలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి సహకరించిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. తన ఆహ్వానం మేరకు కార్యక్రమానికి విచ్చేసిన చిన్నజీయర్ స్వామివారికి, సహకరించిన టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడికి ధన్యవాదాలు తెలిపారు. దేవదేవుడి ఆశీస్సులతో నిర్మితమయ్యే ఈ ఆలయం ఖమ్మం నగరానికి ఆధ్యాత్మిక శోభను తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో టీటీడీ జేఈవో డా. ఎ. శరత్, ఆలయ డిప్యూటీ ఈవో శ్రీ శివప్రసాద్, ఎస్ఈ ఇన్‌ఛార్జి శ్రీ ఎస్. ప్రసాద్, డీఈ శ్రీ సురేంద్ర నాథ్ రెడ్డి, సూపరింటెండెంట్ శ్రీ మల్లికార్జున, అర్చకులు, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మల్లికార్జున నగర్‌లో గుంతల రోడ్లతో ప్రజల అవస్థలు

**రోడ్లపై నిలుస్తున్న వర్షపు నీరు.. దోమల బెడదతో స్థానికుల ఇబ్బందులు**



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రాజేంద్రనగర్ పరిధిలోని లక్ష్మిగూడ మల్లికార్జున నగర్‌లో అంతర్గత రహదారులు గుంతలమయంగా మారడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మ్యాన్‌హోల్స్ సమీపంలో గుంతలు ఏర్పడి నీరు నిల్వ ఉండటంతో దోమల బెడద పెరుగుతోందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను గతంలోనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ, ఇప్పటివరకు పూర్తిస్థాయి పరిష్కారం లభించలేదని మల్లికార్జున నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు అడి కె. మహేందర్ పేర్కొన్నారు. గుంతలతో నిండిన రోడ్లపై రాకపోకలు సాగించడం ప్రజలకు ఇబ్బందికరంగా మారిందని తెలిపారు. గుంతల్లో నీరు నిల్వ ఉండటంతో దోమలు విపరీతంగా పెరిగి, స్థానికులు అనారోగ్య సమస్యల బారిన పడే ఆందోళన నెలకొందన్నారు. సంబంధిత అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితిని పరిశీలించాలని ఆయన కోరారు. మల్లికార్జున నగర్‌లోని అంతర్గత రహదారులకు మరమ్మతులు చేపట్టి, గుంతల్లో నీరు నిల్వ ఉండకుండా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని అడి కె. మహేందర్ కోరారు.



# శ్రమదానంతో ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టిన వాకర్స్: శోభాయమానంగా చింతకుంట పర్యావరణ పరిరక్షణ

**గండిపేట్,(క్రైమ్ మిర్రర్):** అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని రాధాకృష్ణ నగర్ మరియు కాంతారెడ్డి నగర్ సరిహద్దుల్లో ఉన్న చింతకుంట పార్కు ప్రాంగణంలో శనివారం ఉదయం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భారీ ప్లాస్టిక్ వ్యర్థాల ఏరివేత శ్రమదాన కార్యక్రమం అత్యంత ఉత్సాహంగా జరిగింది. ఈ స్వచ్ఛ భారత్ శ్రమదానంలో వాకర్స్, స్థానిక కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని చింతకుంట చెరువు పరిసరాలలో పేరుకుపోయిన ప్లాస్టిక్ సీసాలు, కవర్లు మరియు ఇతర వ్యర్థాలను స్వయంగా శుభ్రం చేశారు. ఈ పారిశుధ్య కార్యక్రమానికి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పారిశుద్ధ్య సిబ్బంది పూర్తి సహకారం అందించారు. ఒకప్పుడు మురికికుంటగా ఉండి తీవ్ర దుర్గంధంతో అలమటించిన చింతకుంటను, నేడు ఆహ్లాదకరమైన నీటి సరస్సుగా మలచడంతో అనేక రకాల వలస పక్షులకు నిలయంగా మారిందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ జీవ వైవిధ్యాన్ని, నీటి స్వచ్ఛతను కాపాడుకోవడానికి ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని వాకర్స్ పిలుపునిచ్చారు. అంతేకాకుండా చింతకుంటను పూర్తి పర్యావరణహితంగా, అద్భుతమైన సహజ సిద్ధమైన నేచురల్ పార్కుగా తీర్చిదిద్దేందుకు సంబంధిత జీహెచ్ఎంసీ అధికారులు మరియు ప్రభుత్వ యంత్రాంగం నిధులు కేటాయించి తగిన సహకారం అందించాలని వాకర్స్ విజ్ఞప్తి చేశారు.


Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.